# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 7-5-2026   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:210   పేజీలు:6   వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

సుందర మూసీ
అందాల పూలతోట
నేతల మాట.

అకాల వర్షం
పంటనీటమునక
రైతుల గోస.

వెల్లుల తావు
అందరికి చదువు
నేతల పూచీ.

చల్లని నీరు
మట్టినీటి కుండలు
మండె ఎండలు.

సరదా ఆట
ఐపీఎల్ పొట్టిక్రికెట్
కాలంపై వేటు.



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

తమిళనాట మోగించే
టీ వీ కే విజయ ఢంక !
డీ ఎం కే , ఏ ఐ ఏ డి
చూస్తున్నాయ్ నింగి వంక !
యాభై యేండ్ల వయసులో
తొక్కె రాజకీయ తోవ !
సాధించిన దాంతొ 'విజయ్'
చేస్తాడా ప్రజా సేవ ?



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు..

## – డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్, మే 6: డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు వంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు.

ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎన్‌డబ్ల్యూ, సీఎన్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

# తెలంగాణలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, మే 06: తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్: బస్వరాజు శ్రీనివాస్
కమ్మ కార్పొరేషన్ చైర్మన్: బండి రమేశ్
వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్: గట్టు తిమ్మప్ప
యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్
వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుక
హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూదెం వెంకట రమణ
లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్
తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ
వాషర్ మెన్ – డాక్టర్ అజయ్ కుమార్
గీత కార్మిక – చంద్ర శేఖర్ గౌడ్
పెరిక – గొంగరి వెంకటేశర్లు
మేర – సంగ వెంకట్ రాజం
మున్నూరు కాపు – బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి
పద్మశాలి – గూడూరి శ్రీనివాస్
వెలమ – జువ్వాడి నర్సింగ్ రావు

# పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలి : ఈ.టీ నరసింహ

హైదరాబాద్, మే 6:తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న ప్రధాన మంత్రి మోదీ చర్యలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ నరసింహ ప్రజలకు పిలుపు నిచ్చారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచడంతో రూ.3,314 చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో అనేక తప్పుడు వాగ్దానాలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రం కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఉద్యోగాలు,ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత టీ.స్టాల్,టీఫిన్ సెంటర్లు,హోటల్స్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నారని గ్యాస్ ధరలను పెంచడంతో వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులు, దోపిడీ వర్గాలకు మరింత లాభాలు చేకూర్చేవిధంగా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం పెంచుతుందని మండిపడ్డారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో మోదీ కీలు బొమ్మగా మారిపోయాడని విమర్శిం చారు.ఈ నెల 10న రాష్ట్రానికి మోదీ వస్తున్న నేపథ్యంలో విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కేటాయింపు వంటి విషయాలపై మోదీని నిలదీసేందుకు ప్రజలు నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి స్టాలిన్,సహాయ కార్యదర్శి కమతం యాదగిరి,నేతలు బి.వెంకటేశం, ఎన్.శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మహ్మద్ సలీం, ఉమర్‌ఖాన్, సక్రిబాయి, బాలకృష్ణ, మహమూద్, బి.కిషన్, అనిల్‌కుమార్, భగత్‌సింగ్, షబ్బీర్, సుశాంత్, అరుణ్, లతీఫ్, మనోజ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం.. గవర్నర్‌ను కలిసిన విజయ్



చెన్నై, మే 6: టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీఎంకే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# హర్మూజ్ జలసంధిలో ప్రాజెక్టు ఫ్రీడమ్‌కు బ్రేక్.. డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



న్యూఢిల్లీ, మే 6: ఇరాన్ పై అమెరికా , ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియా లో కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పుడు కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధి లో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ' కు బ్రేక్ పడింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో పురోగతి నేపథ్యంలో ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో ఒక పోస్టు పెట్టారు.

పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు ఇరాన్‌పై సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్ ప్రతినిధులతో ఒక సంపూర్ణ, తుది ఒప్పందం దిశగా కొనసాగుతోన్న ప్రయత్నాల్లో పురోగతి సాధించామన్నారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టంచేశారు. ఒప్పందంపై పూర్తి స్పష్టత వచ్చేంతవరకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ బహిరంగ ప్రకటనలకు విరుద్ధంగా తమతో ఒక ఒప్పందం చేసుకునేందుకు రహస్యంగా ప్రయత్నిస్తుందని ట్రంప్ అన్నారు.

ఇరాన్ లొంగిపోవాలని ట్రంప్ హెచ్చరించారు. తాము పూర్తిస్థాయిలో పోరాటానికి దిగితే ఇరాన్ ఆవలేదని వ్యాఖ్యానించారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో విదేశీ నౌకలను జలసంధి నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో ట్రంప్ ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు. దీన్ని మానవతా చర్యగా అభివర్ణించారు. కాగా ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను ప్రారంభించిన కొన్ని గంటలకే దాన్ని తాత్కాలికంగా నిలిపివేసున్నట్లు ట్రంప్ ప్రకటించడం చర్చకు దారితీసింది. ట్రంప్ నిర్ణయాన్ని ఇరాన్ తాను సాధించిన విజయంగా చెప్పుకుంటోంది.

# నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు.. జలమండలి వార్నింగ్

హైదరాబాద్, మే 6: భాగ్యనగరంలో నీటి సరఫరా వ్యవస్థను దెబ్బతీసే అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు చేపట్టింది. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన అధికారులు అక్రమ ంగా నల్లాలకు మోటార్లు బిగించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ దాడుల్లో మొత్తం 18 మోటార్లను సీజ్ చేశారు.

జలమండలి విజిలెన్స్ అధికా రులు ఈరోజు (బుధవారం) కూకట్‌పల్లి జోన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బాలాజీ నగర్ వార్డు, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్–1 ప్రాంతాల్లో అక్రమ నీటి వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహి ంచారు. అధికారుల పరిశీలనలో భాగంగా పైపులైన్‌ల కు నేరుగా మోటార్లు బిగించి నీటిని అక్రమం గా వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు.ఇలా నిబంధనలు ఉల్లంఘించిన ఇళ్ల వద్ద నుంచి మొత్తం 18 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తులకు హెచ్చరి కలు జారీ చేశారు. రెండోసారి పట్టుబడితే రూ.5,0 00 జరిమా నా విధిస్తామని, అవసరమైతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నీటి సరఫరా వ్యవస్థను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నల్లాలకు మోటార్లు బిగించవద్దని జలమండలి అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం వల్ల ఇతర వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇళ్లలో నీటి సమస్యలు ఉంటే అక్రమంగా మోటార్లు బిగించకుండా జలమండలిని సంప్రదించాలని సూచించారు. లో ప్రెజర్ లేదా నీటి కొరత సమస్యలుంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పైపులైన్ మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో వేసవి కాలంలో నీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నగరవ్యాప్తంగా అక్రమ మోటార్లపై తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# సనత్‌నగర్‌లో దారుణం.. భార్యపై భర్త దాడి, చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్, మే 06: నగరంలోని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన భర్త, భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడంతో, ఆమె తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన చంద్ర భాను, అతని భార్యల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతు న్నాయి. ఈ క్రమంలోనే మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన చంద్ర భాను భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది.

స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న సనత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిందితుడు చంద్ర భానును అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

**చురక**


రాజ్యమే ఎన్నికల్లో
రిగ్గింగ్ కు అండదండ
ఐతే కాదా ప్రజాస్వామ్య
హననానికి ఇది దండ
బెంగాల్ లో నేడక్కడ
భారతంలో రేపెక్కడో
అధికారం జైత్రయాత్ర
అత్యాశకు అడ్డెక్కడో



–వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

సహృదయ వశవర్తి
కృష్ణ రాయల కీర్తి
తాల్చె శాశ్వత మూర్తి
అనును రాధశ్రీ !!
తిలకించు మాేవి
ఆజన్మ రణజీవి
ఆమె రుద్రమ దేవి
అనును రాధశ్రీ !!




–రాధశ్రీ
సెల్:9494481210

# మన సుకవి... మనసు కవి ఆత్రేయ

1921 మే 7 న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట మండలంలో గల మంగళంపాడు గ్రామంలో ఆత్రేయ జన్మించారు. తండ్రి కృష్ణమాచార్యులు. తల్లి సీతమ్మ. చిన్నప్పటినుండి నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదివేవారు. సమాజంలో మధ్య తరగతి కుటుంబ సమస్యలను తీసుకుని మనోహరమైన నాటకాలుగా మలిచారు. 'ప్రవర్తన', 'ఎన్.జి.వో' నాటకాలు ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డులను గెలుచు కున్నాయి. విశేషంగా రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. అలాగే 'కప్పలు' బాగా ప్రాచుర్యం పొందిన నాటకం. రాయలసీమ క్షామ పరిస్థితులను వివరించే 'మాయ' నాటకం, స్వాతంత్ర్యా నంతరం దేశంలో చెలరేగిన హిందూ ముస్లిం హింసాకండను 'ఈనాడు' అనే మూడంకాల నాటకం, విశ్వశాంతిని కాంక్షించే 'విశ్వశాంతి' నాటకాన్ని రచించారు. విశ్వశాంతి నాటకానికి కూడా రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. 'సామ్రాట్ అశోక', 'గౌతమ బుద్ధ', 'భయం' నాటకాలు కూడా వ్రాసారు. ఆత్రేయ పలు చలన చిత్రాలకు సంభాషణలు, పాటలు రాశారు. ఆయన పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండటం వలన అతను మనసు కవి, మన సుకవి అయ్యారు. దీక్ష (1950) చిత్రానికి తొలిసారి గీత రచన, అదే సంవత్సరంలో విడుదలైన సంసారం చిత్రానికి తొలిసారి కథా రచన చేసారు. వాగ్దానం (1961) చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం కూడా చేసాడు. చిన్ని చిన్ని పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాఠి. తెలుగు పాటను ఆస్వాదించే అందరి మనసులను దోచుకున్న ఈ మనసు కవి 1989, సెప్టెంబర్ 13 న ఈ లోకాన్ని వదిలి పోయారు.

ఆత్రేయ తాత్విక ధోరణితో రాసిన సంభాషణలు జీవిత తత్వాన్ని గుట్టు విప్పుతాయి. జీవితాన్ని కాచి వడబోసిన నగ్నసత్యాలు. ప్రతి వ్యక్తి జీవితానికి మార్గదర్శకాలు. "వెలుగు నీడలు" చిత్రంలో ఇటువంటి ఓ అద్భుత సంభాషణ తనదైన శైలిలో రాసి ఓ సన్నివేశానికి ఆత్రేయ జీవం పోసారు. సెంటిమెంటల్ అనే పదానికి భావగర్భితమైన, కరుణ రసముగల, శృంగార భావములుగల అర్థాలు న్నాయి. సినిమా పరిభాషలో సెంటిమెంటల్ డైలాగ్స్ అంటే పరస్పర ప్రేమాను రాగాలను, ఆత్మీయానుబంధాలతో, కరుణ రస భరితంగా ఒకరికొకరు సంభాషించుకోవడం. సెంటిమెంటల్ డైలాగ్స్ రాయడంలో ఆత్రేయది అందెవేసిన చెయ్యి. ఆత్రేయకు లేడీస్ సెంటిమెంట్లు లేక పోయినా లేడీస్ సెంటిమెంట్ డైలాగ్స్ బాగా రాస్తారని చెప్పుకుంటారు. ఆత్రేయ గొప్ప వేదాంతి. ప్రతి విషయాన్ని వాస్తవిక దృష్టితో ఆలోచించి సంభాషణలను సమకూర్చాడు. "వేదాంతం, వైరాగ్యం ఒంట పడితే చాలా ప్రమాదం. వాటి జోలికిపోకుండా ఉంటే చాలా మంచిది. అవి మనిషిలోని కార్య దీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి" అని ఆత్రేయ అనేవారు. శృంగార రసం శృతి మించితే అశ్లీలం అవుతుంది. ఇటువంటి కొన్ని సన్నివేశాలకు రచయిత పచ్చిగా రాయక తప్పదు. నేను రాయను అని మడికట్టుకు కూర్చుంటే సినీ రచయితగా చిత్ర పరిశ్రమలో ఏ రచయితా నిలబడ లేడు. ఈ కారణమే ఆత్రేయను బూత్రేయం అని కూడా పేరు మూట గట్టుకునేలా చేసింది.



'దీక్ష' (1950) చిత్రానికి తొలిసారి అతను పాటలు రాశారు. "పోరా బాబు పో.." అంటూ సాగే పాట ప్రేక్షకులను, సినీ మేకర్స్‌ని బాగా ఆకట్టు కోవడం ఆత్రేయ పాటల్లోని మాధుర్యం ఏంటో సినిమా పరిశ్రమకు తెలిసింది. అదే ఏడాదిలో విడుదలైన 'సంసారం' చిత్రానికి తొలిసారి కథా రచన కూడా చేశారు. దీంతో దర్శక, నిర్మాతలంతా ఆత్రేయతో పాటలు రాయించేందుకు క్యూ కట్టారు. 'అర్ధాంగి' చిత్రంలో 'రాక రాక వచ్చావు చందమామా..', 'తోడి కోడళ్ళు' చిత్రంలో 'కారులో షికారుకెళ్లి...', 'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం'లో 'శేశైలవాసా శ్రీ వెంకటేషా...', 'మంచి మనసులు'ల్లో 'శిలలపై శిల్పాలు చెక్కినారు...', 'మూగ మనసులు' చిత్రంలో 'ముద్ద బంతి పువ్వులో...' 'డాక్టర్ చక్రవర్తి'లో 'నీవులేక వీణ ...', 'అంతస్తులు'లో 'తెల్ల చీర కట్టుకున్నది ఎవరి కోసము...', 'ప్రేమ్‌నగర్'లో 'నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది. నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది. నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది...', 'మరోచరిత్ర'లో 'ఏ తీగ పువ్వునో ఏ కొమ్మ తేటినో...', 'ఇంద్ర ధనస్సు'లో 'నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి...', 'అంతులేని కథ'లో 'కళ్ళల్లో ఉన్నదేదో కన్నులకు తెలుసు...', 'మరో చరిత్ర'లో 'విధి చేయు వింతలన్నీ...', 'ఇది కథ కాదు'లో 'సరిగమలు గలగలలు...','స్వాతిముత్యం'లో 'చిన్నారి పొన్నారి కిట్టయ్య...' తోపాటు 'తేనే మనసులు', 'ప్రైవేట్ మాస్టర్', 'బ్రహ్మచారి', 'మట్టిలో మాణిక్యం', 'బడి పంతులు', 'పాపం పసివాడు', 'భక్త తుకారం', 'బాబు', 'జ్యోతి', 'అందమైన అనుబంధం', 'గుప్పెడు మనసు', 'ఆకలి రాజ్యం', 'అభిలాష', 'కోకిలమ్మ', 'అభినందన', 'ప్రేమ' వంటి చిత్రాల్లో 400లకుపైగా పాటలు రాసి తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పాటలన్ని భావోద్వేగాల సమాహారంగా ఉండటంతో ఆత్రేయను 'మనసు కవి'గా ప్రేక్షకులు, అభిమానులు అభివర్ణించారు. ఎంతటి బరువైన భావాలనైనా అర్థవంతమైన తేలికైన పదాలతో పలికించడంతో ఆత్రేయ దిట్ట. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. పాటల్లో తన అనుభవాలను పొదిగి, గుండె బరువును దించుకునే వారని ఆయన సన్నిహితులు పలు సందర్భాల్లో చెప్పారు.

రాయక నిర్మాతలనూ రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆయన పై ఓ ఛలోక్తి. కానీ ఆత్రేయ... రాస్తూ నేనెంత ఏడుస్థానో ఎందరికి తెలుసు అనేవారు.

తెలుగు సినిమా పాటలను మామూలు వాడుక మాటల తోనే రాయగలిగిన ప్రతిభాశాలి ఆత్రేయ. ఉదాహరణకు, తేనె మనసులు సినిమాలో ఈ రెండు పాటలు "ఏవమ్మా నిన్నేనమ్మా ఏలా ఉన్నావు," "నీ ఎదుట నేను వారెదుట నీవు, మా ఎదుట ఓ మామా ఎప్పుడుంటావు." అలాగే ప్రేమనగర్ సినిమాలో "నేను పుట్టాను ఈలోకం మెచ్చింది,, నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది, నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది." పాట,, "తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా" పాట. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టా అనంతమే అవుతుంది.

మరోచరిత్ర సినిమాకి రాసిన పాటలు
ఏ తీగ పువ్వునో...ఏ కొమ్మ తేటినో...
పదహారేల్లకు...నీలో నాలో
బలే బలే మగాడివోయ్ ...నీ అన నీ దానినోయ్...అనే పాటలు ఇప్పటికి శ్రోతలని అలరిస్తూనే ఉన్నాయి.

కృష్ణ, శారదలు నటించిన "ఇంద్ర ధనుస్సు" సినిమాలోని పాట "నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి" అనే పాట ఆత్రేయకు అత్యంత ఇష్టమైన పాటగా చెబుతారు. అతను? ఒకసారి ఏదో సందర్భంలో ఈ పాట నా జీవితానికి సంబంధించిన పాట అని చెప్పారు.

మనసును గూర్చి ఆత్రేయ రాసినన్ని పాటలు వేరొకరు రాసి ఉండలేదు. అందుకనే ఆయనను మనసు కవి అనేవారు.

ఆత్రేయ పాటల రచయిత మాత్రమే కాకుండా, అనేక సినిమాలకు మాటల రచయితగా కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రేమనగర్ సినిమా విజయంలో ఆత్రేయ రాసిన పాటలు, మాటలు ముఖ్యభూమిక వహించిందంటే అతిశయోక్తి కాదు.

మే 7...ఆచార్య ఆత్రేయ జయంతి



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 7-5-2026

## నిశ్శబ్ద రాగాలు

ఆలింగనం చేసుకున్న వాళ్ళంతా
ఆత్మీయులు కారు
పలకరింపుకు దూరంగా ఉన్న వారంతా
పరాయి వారు కారు.

శాలువాలూ పూలగుచ్ఛాలూ
సత్సంబంధాలనుకోలేం
సంస్తుతీ చక్కెర పలుకులూ
సహృదయతగా భావించలేం.

వాలిన పక్షులన్నీ
బంధువులు కావు

రాలిన పూలన్నీ
జాలీ సానుభూతులూ కావు.

ఆనంద విషాదాలు
తనవి అయితే ఆగవు, దాగవు
తనవి కాకపోతే
అంత సులభంగా ప్రకటింపబడవు
అంత అలవోకగా ప్రవహించవు.

కనుకొలకుల్లో బాష్పాలు
కనిపించకుండా దాక్కుంటాయి

పెదవిపై మాటలు
పెకలకుండా అణగిపోతాయి.

అనుబంధాలు ఆత్మీయతలు
ఆనవాయితీలు కావు,
ఆడంబరాలూ కావు
అవి అంతరాంతరాల్లో
అలుముకున్న వెలుగు చీకట్లు
పెనవేసుకున్న వేళ్ళ మూలాలు
అక్కడ తడి పైకి కనిపించదు
సడి పైకి వినిపించదు



-డా॥గంద్ర లక్ష్మణ రావు
9849328036

## మాకు జన్మనివ్వకండి



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

అన్య చాలా సీరియస్‌గా వచ్చింది.

"మీరు పత్రికలు చదువుతున్నారా? టీ.వీ.ల్లో వార్తలు చూస్తున్నారా?" అంది.

"చూస్తున్నాం. చదువుతున్నాం" అన్నాం నేనూ, విదూ.

"ఇప్పుడు ప్రతిరోజూ హత్యలూ, ఆత్మహత్యల వార్తలే కదా. ఇంతకుముందు మగవాళ్ళు మాత్రమే హత్యలు చేస్తారు అనుకునే వాళ్ళం. ఇప్పుడు ఆడవాళ్ళు కూడా అవి మొదలుపెట్టారు. అసలు నాకు బాధ అనిపించేది

ఒకటుంది. ఈ మధ్య కొంతమంది అమ్మలు అది ఏ సమస్య అయినా కావచ్చు తమ పిల్లల్ని చంపి, తర్వాత వాళ్ళు ఛస్తున్నారు" అంది.

నేనూ, విదూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నాం.

"నీకు పేదరికం వుంది. సవాలక్ష సమస్యలు వున్నాయి. పిల్లల్ని పెంచటం నీకు కష్టంగా వుంది.




అందుకని పిల్లల్ని చంపేయటమేనా?" అంది ఆవేశంగా.

"అది సరయింది కాదు" అన్నాను.

"ఇలా చేయాలనుకున్నవారు తామే నిర్ణయాలు తీసుకోవటం కాదు. ముందు పిల్లలను అడగండి. నేను చనిపోవాలనుకుంటున్నాను. మీరు అనాథలవుతారు. అందుకని మనం దరం కలిసి చనిపోదాం మీకు

ఇష్టమేనా అని అడగాలి కదా!"

"పిల్లలు అలాగే అంటారను కుందాం. అప్పుడు చనిపోవచ్చా?" అడిగాడు విదూ.

"ఎలా చనిపోతారు విదూ? పిల్ల లు చిన్నవారు. వారికి చావు గురించి తెలుస్తుందా? ఒకవేళ వాళ్ళు అలాగే

అమ్మా అన్నా అలాంటి పని చేయకూడదు. అసలు మనుషులు పిల్లల్ని ఎందుకు కంటున్నారు.

చనిపోవటానికి, చంపటానికా? చివరకి రాక్షసులు కూడా ఇలాంటి పనులు చేయరే!" అంది.

అన్య మాట్లాడుతున్నప్పుడు గొంతు వణుకుతోంది. ఈరోజు తను చాలా మాట్లాడింది.

"సింగిల్ మదర్స్ అంట. వాళ్ళు అమ్మాయినో, అబ్బాయినో కంటారంట. పెంచుకుంటారంట. మొగుడు,

సంసారం లాంటివి అవసరం లేదంట. మరి నీకు పిల్లలు మాత్రం ఎందుకు అని నేను అడుగుతున్నాను.

నువ్వు సింగిల్‌గానే బతికి చావవచ్చు కదా. రేపు నువ్వు ముసలిదానివి అవుతావు. అప్పుడు నీకు సేవలు చేయటానికి పిల్లలు కావాలా? నీలో ఇంత స్వార్థం వుందా? అసలు నువ్వు స్త్రీవేనా?" అని మాట్లాడలేకపోయింది.

"అవును అన్యా! ఇలాంటి వారందరూ అడవుల్లో బతకటం లేదు. మనుషుల మధ్య బతుకుతున్నారు. పిల్లలు

చదువుకోవాలి. పక్కవారితో కలిసి బతకాలి. మీరు బడి దగ్గరకు వెళ్ళండి. అక్కడ పిల్లలు మీ నాన్న ఎవరు అంటారు. చుట్టుపక్కల వారు పిల్లల గురించి గుసగుసలు చెప్పుకుంటారు. అవన్నీ మీకు వినిపిస్తాయా?

వినిపించినా మీరు పట్టించుకుంటారా? మీరు ప్రపంచాన్ని ధిక్కరించటం ఎప్పుడో మొదలుపెట్టారు. మీరు దేనినీ లెక్కచేయరు. కానీ మేం పిల్లలం. తల్లులూ? మాకూ కొన్ని ఆలోచనలుంటాయి. మాకూ హక్కులువుంటాయి. పుట్టినా, లేదా మీరు పుట్టించిన నేరానికి బతుకంతా మేం ఈ శిక్షను అనుభవించాలా? అవును ఇప్పుడు పిల్లలు మాట్లాడతారు" అన్నాను.

"ఇదివరకు నయం మేంగో. ఏ కారణంతో అయినా పెళ్ళి చేసుకోని వారున్నారు. వాళ్ళు సింగిల్‌గానే బతికారు.

మేం ఇలా వుండటానికి మా కారణాలు మాకున్నాయి అనేవారు తప్ప ఇదేదో మహత్తర కార్యక్రమం అనిప్రచారం చేసుకోలేదు" అంది అన్య.

"ఇంకో విషయం తెలుసా? ఆస్తుల విషయంలో తగాదాలు వచ్చినప్పుడు చిన్నపిల్లలను చంపుతున్నారు.

వాళ్ళల్లో వాళ్ళే నరుక్కుని చావచ్చు కదా!" అన్నాడు విదూ.

"మనుషులు ఇంత కష్టపడేది, అన్యాయంగా సంపాదించేది పిల్లల కోసమే కదా. అందుకని వారిని చంపితేబతికు న్నంత కాలం కుళ్ళి కుళ్ళి జీవచ్ఛవాల్లా బతుకుతారు అనుకుం టారు. ఎవరు చావు లేకుండా బతుకుతారు. చంపేవా రు కూడా జీవిత ఖైదీలుగా బతకాలి. ఉరికంబం ఎక్కాలి. ఏం సాధిస్తున్నారు ఈహంత కులు?" అన్నాను.

"ఒకడికి తన భార్య మీద అనుమానం. తన పిల్లలు తనకు పుట్టలేదంటాడు. చంపేస్తాడు. ఇంకో మహిళకు

తన ప్రియుడితో సంబంధానికి అడ్డుగా వున్నారని పిల్లల్ని చంపుతుంది. అంటే

ఇప్పుడు హత్యలూ,ఆత్మహత్యలన్నీ పిల్లల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రపంచంలో అందరూ తమ హక్కుల గురించి పోరాటాలు చేస్తున్నారు. అలా చేయ లేనిది పిల్లలు మాత్రమే. అన్ని రకాల అన్యాయాలకు గురవుతున్నది పిల్లలే?

పిల్లలే" అని అన్య కన్నీళ్ళు పెట్టుకుంది.

"దీనికి పరిష్కారం ఏమిటి?" అన్నాను. అన్య కళ్ళు తుడుచుకుంది.

"ఇక్కడ చాలా సమస్యలకు పరిష్కారం లేదు. ఇవి ప్రస్తుతం అక్కడక్కడా జరుగుతున్నాయి. అమ్మానాన్నలూ? మీకు డబ్బు మాత్రమే కావాలి. సంపాదనే కావాలి అనుకుని విదేశాలు పోవటం, ఇక్కడ రాత్రీపగలూ కష్టపడటం కాదు. డబ్బు మాత్రమే మనకు రాదు. అది అన్ని అనర్థాలను తీసుకువస్తుంది. ఇదికొనసాగితే సమాజం కుప్పకూలుతుంది. అందుకని ఈ ప్రపంచంలోకి రండి. మీకు మీ రిలేషన్స్, మీ సుఖాలుకావాలనుకుంటే పిల్లల్ని మాత్రం కని బలి పశువులు చేయకండి. గుర్తుంచుకోండి అమ్మా నాన్నలను పిల్లలుబహిష్కరించే రోజులు తెచ్చుకోకండి" అంది అన్య.



ఏప్రిల్ 28 మంగళవారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో డా॥ చెమన్ రచించిన "కుమ్మరికుంటోని కథలు" ఆవిష్కరణలో పెద్దింటి అశోక్‌కుమార్, ప్రొ॥ కాశీం, ఆవిష్కర్త డా॥ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, డా॥ చెమన్, స్వర్ణ కిలారి, డా॥నామోజు బాలాచారి, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్.

## సందేశాత్మ హాస్యమిళిత సంకలనం "ఓ వర్షపు సాయంకాలం"

పుస్తక సమీక్ష

కథలు అంబర వీధిలోనో స్వప్న సీమల్లోనో పుట్టవు. సమకాలీన జీవితాల్లోంచి, ఎప్పటికప్పుడు జరిగే సంఘటనల్లోంచి పుట్టుకు వస్తాయి. చదివినప్పుడు మనం అనుభవిస్తున్నట్టే అనిపిస్తాయి.

అందులోనూ కేతవరపు రాజ్యశ్రీ రాసిన **"ఓ వర్షపు సాయంకాలం"** లోని కథలు రోజు వారీ మన ఇళ్లల్లో జరిగే సంఘటనలే. హాయిగా ఆహ్లాదంగా చదువుకుని ఆనందించ గలిగేవి. పెద్ద భారాన్నీ, దుఃఖాన్నీ మన మీద రుద్దవు. సరదాగా చమత్కరిస్తూనే, సుకుమారమైన సూచనలనూ అందిస్తాయి.

కొన్ని అనుభవాలు, కొన్ని జ్ఞాపకాలు కలబోసుకోడం, కాలంతో పాటు మారుతున్న పోకడలు, జీవన విధానాలు, ప్రవృత్తుల కథనాలివి.

"ముదితల్ నేర్వగరాని విద్యక లదే " అన్న కథలో గొప్ప మానసిక స్థైర్యాన్ని స్త్రీలందరికీ అందించడం ఎంతో మెచ్చదగిన అంశం.

''బామ్మ వీలునామా'' లో సునిశితమైన మనో విశ్లేషణ, "భిన్న కోణాలలో'' ఒక విశాలమైన పరిధిలో రకరకాల మనస్తత్వాల అంగీకారం చక్కగా చూపించారు. హాస్యంగా అనిపించే విమర్శ "తెరచిన నోరుమూయడం" కథ. ఇలా ఎన్నెన్ని అవలోకనలో!

"12 వ రోజు" కథలో చెప్పిన స్పష్టమైన నిజాలు , "వైకుంఠం " కథలు, జీవితం గురించి ఆలోచింపజేస్తాయి.

అలాగే "దూరపు కొండలు" మొదలు "ఇంటిపేర్లు తెచ్చిన తంటా" వరకూ , అన్ని కథనాలూ మనవే ! మనను మనం ఒకసారి తరచి చూసుకునేలా చేసేవి. మధ్యతరగతి మహావైభోగాలే! చదివి తర్కించుకోవలసిన చక్కని సందేశాత్మక , హాస్య మిళిత సంకలనం " ఓ వర్షపు సాయంకాలం " కథల పుస్తకం. రచయిత్రి రాజ్యశ్రీకి అభినందనలు.




**ప్రతులకు:** కె. రాజ్యశ్రీ
సెల్: 8500121990



-స్వాతీ శ్రీపాద
8297248988

## మట్టి బొమ్మ

పుట్టినప్పుడు మాంసం ముద్ద
అమ్మ స్తన్యంతో రూపు దిద్దుకున్నా..
లాలలు జోలలు
ఆకలి మారాలు
ఆమె చేతి గోరుముద్దల గారాలు.
బోర్లపడటం, బంగరటం
నాన్న వీపుపై పడుకోవటం

అమ్మ వడిలో అక్షరాభ్యాసాలు
నాన్న వేలుపట్టి చూసిన ప్రపంచ గతుల అభ్యాసాలు
..
శిక్షణలు, చేసిన అల్లరికి శిక్షలు.
చేసిన తప్పులకు అయ్యవారు చెవి మెలివేతలు ..
చురుకుదనం ఉట్టిపడు మిత్రులు
పోటీ పరీక్షల్లో శత్రువులు
తుంటరులతో గలాటాలు
బల ప్రదర్శనకి పోరాటాలు ..
నాన్న ప్రవర్తన అనుకరణ
గురువుల సాన్నిహిత్యంతో వశీకరణ..

ప్రజ్ఞని పుటం పెట్టు పరీక్షలు
జీవితాశయం నెరవేర్చు నౌకరీలు.
జీవిత గమనంలో ఘటనలు
ఇది నాది అని చెప్పలేని సంఘటనలు ..
రుచులు,అభిరుచులు
చుట్టుపక్కల వారి వచనాలు
మరచిపోలేని అమ్మ నాన్నల ప్రవచనాలు.
నా జీవనం సంఘం
చెక్కిన శిల్పం.



-వి. యస్. శాస్త్రి. ఆకెళ్ళ
సెల్:7095858667

# ఆంగ్లం అవసరం
# తెలుగు జీవితం

*గౌరవనీయులైన తల్లిదండ్రులకు,*
*నమస్కారం.*

వేసవి సెలవులు ఆరంభమయినవి.మీ అందరి ఇంటి లోగిలి పిల్లా పెద్దలతో కళకళలాడుతున్నది కదా! చాలా సంతోషకర మయిన విషయం. వేసవి సెలవులనగానే పిల్లలందరికీ అమ్మమ్మ ఇల్లే గుర్తొస్తుంది . నానమ్మ, తాతయ్య ల ప్రేమానురాగాలే మెదులుతాయి.

అమ్మమ్మ, తాతయ్య, మామ, అత్త, చూపే అపురూపమైన ప్రేమ, ఎప్పటికప్పుడు చేసే ప్రత్యేక వంటలు, హద్దు గీయని సద్దు చేసే ఆటలు, వీటన్నింటినీ ఆస్వాదించడానికి మీ,మీ పిల్లలందరూ సిద్ధమయ్యే ఉంటారు.ఇది ఆనందించదగిన విషయమే. కానీ, ఇక్కడే మీ అందరితో ఒక విషయం పంచుకోవాలనుకుంటున్నాను.

అదేమిటంటే,ఒక పదిహేను,ఇరవై ఏళ్ల క్రితం వరకు వేసవి సెలవులంటే అమ్మమ్మ చెప్పే కమ్మని కథలు, తాతయ్య నేర్పే రామాయణ,భాగవతాలు,మామ గారితో ఆడే అష్టాచెమ్మా, బొమ్మరిల్లాటలు, అత్తగారు చెప్పే ఇరుగు పొరుగు ముచ్చట్లు వింటూ పిల్లలు ఒక ప్రత్యేక వ్యక్తిత్వానికి పునాది వేసుకునేవారు.

కానీ, రోజులు మారాయి.కథల స్థానంలో యూట్యూబ్ వీడియోలు,పద్యాల స్థానంలో ఇంగ్లీష్ పాటలు,ఆనందాల ఆటల స్థానంలో పబ్జీ లాంటి ఆటలు వచ్చి చేరాయి.వీటివల్ల ఇష్టాలు, నష్టాలు మాటేమిటో గానీ, మంచిని పెంచగలిగే సామర్థ్యం మాత్రం కొంచెం వెనక్కి పోతున్నదన్న విషయం అందరికీ తెలిసిందే .అయినా చాలా మంది ఈ దారిలోనే వెళ్ళడానికి ఇష్టపడుతున్నారు.ఎక్కడో కొందరు తప్ప.అయినా, మరిచిపోయాను

మీతో ఇంకొక విషయం చెప్పాలి..మనందరికి కూడా మన పిల్లలు ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇష్టమే .ఎందుకంటే ఇంగ్లీష్ నేర్చుకుంటేనే ఉద్యోగాలు వస్తాయి అనే బలమైన నమ్మకాన్ని సమాజం మనందరి మనసుల్లో బలంగా నాటింది.అందుకే పిల్లలు మన అమ్మ భాషను వదిలి పెట్టి, ఇంగ్లీష్ లో ఏది చెప్పినా కొండెక్కినంత సంతోషం మనకు.ఇందులో తప్పు అనలే లేదు.ఆంగ్లం నేర్చుకోవల్సిందే.పెద్ద పెద్ద ఉద్యోగాలు సంపాందించాలనే ఆకాంక్ష ఉండవలసినదే. కానీ, ఆంగ్లం వృత్తి నైపుణ్యానికి అవసరమైన, అందమైన, విలువైన విదేశీ భాష.ఈ భాషను పకడ్బందీగా నేర్చుకోమని ప్రోత్సహిద్దాం. నేర్చుకునేలా తోడ్పాటునందిద్దాం.ఇక్కడే మరో విషయం కూడా చెప్పాలి.

ప్రస్తుత సమాజంలో, గణితం, సైన్స్ బాగా వస్తే చాలు.వాటితో మా పిల్లలు ఇంజ నీర్, డాక్టర్ అవుతారనే నమ్మకం పెరిగిపోయింది.ఇదీ తప్పు లేదు.ఏ తల్లిదండ్రికయినా తమ పిల్లలు బాగా చదువుకోవాలి.పెద్ద ఉద్యోగం సంపాదించాలనే ఉంటుంది .దాన్ని మనమెవరమూ తప్పు పట్టలేము.కానీ,ఆ రెండింటింతో పాటు, అమ్మ ఒడిలో నుండే ప్రేమగా నేర్చుకొన్న తెలుగు భాషను కూడా మరిచి పోవద్దు. కానీ,మనందరిలో చాలా మంది పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే "అమ్మ భాష"బాగా రావాలని ఎక్కువగా కోరుకోవడం లేదు.దీనికి మూల్యం ఇప్పటికే మనం చెల్లించుకుంటున్నాము.తల్లిదండ్రుల చెమట చుక్కలతో ఎదిగిన పైరులై, వారి శ్రమ శక్తినంతా విదేశాలకు, కేవలం వారి వారి స్వప్రయోజనాల కు ఎగుమతి చేసే యువతీ యువకుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది.తల్లి, తండ్రి, అక్కా, చెల్లి అనే బంధాల కంటే, ,బంగారం,బంగ్లాలు, సిరి సంపదలే ముఖ్యమనుకొని,బాధ్యతలు మరిచిపోతున్న తరాన్నీ చూస్తూనే ఉన్నాము.

ఇదీ తప్పు లేదు.ఎవరైనా ఉన్నత జీవితం కావాలనే కదా కోరుకునేది.కానీ,ఉన్నత జీవితమంటే కేవలం తామొక్కరే బాగుండాలని కోరుకోవడం కాదు.తమతో పాటు తమవారందరూ బాగుండాలని కోరుకోవడం.అందుకోసం అందరికీ అండగా నిలబడగలిగే వ్యక్తిగా ఎదగగలగడం.మరి ఇలా ఉన్నత వ్యక్తిగా ఎదగాలంటే, ఏది మంచి, ఏది చెడు అని తెలిపే విచక్షణ కలిగి ఉండడం.ఈ విచక్షణ ఎలా తెలుస్తుంది?

మన పూర్వ కవులు జీవితానుభవాలనన్నింటినీ రంగరించి రాసిన శతక పద్యాలు, నీతి, నిజాయితీ, ధర్మం,అధర్మం, ధైర్యం, స్నేహం,

పరోపకారం, సాహసం వంటి అనేక విలువలను చెప్పకనే చెప్పి మనసులో నాటుకునేల చేసే కమ్మని కథల ద్వారా వస్తుంది.

వీటన్నింటినీ అడపా, దడపా తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యులు నేర్పించే వాతావరణంతో కూడిన సమాజం ఏర్పడితేనే , మనుషులు మరబొమ్మల్లా కాకుండా,మానవతా విలువల సిరులుగా ఎదిగేది.ఇప్పటికే మనం చూస్తున్నాం.కృత్రిమ మేధతో ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు సృష్టించగలిగే యాంత్రికత,మనుషుల్ని యంత్రాలుగా మార్చేస్తున్నది.ఇంకా ఈ యాంత్రికంలో పూర్తిగా చిక్కుకు పోయి,మనసన్నదే లేని మనుషులుగా మన పిల్లలు మిగలకూడదంటే, పిల్లలందరికీ ఈ వేసవి సెలవుల్లో రోజుకొక గంట సమయమయినా వెచ్చించి,జీవిత విలువలను నేర్పే పద్యాలు, పాటలు, కమ్మని కథలు చెప్పే ప్రయత్నం చేయాలి.రోజు మొత్తంలో పిల్లలు ఎన్ని గంటలు ఎలాంటి ఆటలు ఆడినా,ఒక గంట సమయం మాత్రం భారత, రామాయణ గాథలు,ఇతర విశేషాలు తెలుగు లో నేర్చుకొనేలా ప్రోత్సహించాలి.ఇక్కడ మీ అందరితో మరొక విషయం చెప్పాలి.అలనాడు లంకను చూసిన లక్ష్మణుడు, రామునితో,అన్నా,లంకా నగరం ఎంత బాగుంది అని చెప్పే సందర్భంలో, రాముడు లక్ష్మణునితో,తమ్ముడూ, ప్రపంచంలో మనం పుట్టిన నేలకంటే ఏదీ గొప్పది కాదు.ఆ తలంపు కూడా మన మనసులోనికి రానీయకూడదు.మనం పుట్టిన నేల స్వర్గం కంటే గొప్పది అనే భావమే మనలో ఉండాలి అని,"జననీ జన్మ భూమిశ్చ,స్వర్గాదపీ గరీయసీ"అనే మాటను చెప్పాడట.అందుకే మనం కూడా,"మాతృ భాష, మాతృ దేవత,మాతృ దేశం"సర్వదా వందనీయాలు అనే సూక్తిని నమ్ముతూ, విజ్ఞానార్జన కోసం ఆంగ్లం నేర్పినా, ఉద్యోగం కోసం, జ్ఞాన సంపద కోసం, సమాజాభివృద్ధి కోసం గణిత, సామాన్య శాస్త్రాలను ఎంతో ఉన్నతంగా నేర్చుకోవాలని ప్రోత్సహించినా,జీవిత విలువలను నేర్పించే తెలుగు పద్యాలను, కథలను, ఇతిహాసాలను నేర్పించడం మాత్రం మరిచిపోవద్దు.అప్పుడే పిల్లలు ఎదిగి పెద్దవారయిన కొలదీ, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లనయినా, మంచి,చెడుల విచక్షణ నయినా తెలుసుకోగలిగి ముందుకు సాగుతారు.లేదంటే, ఇప్పటికే అక్కడక్కడా జరిగే సంఘటనలు చూస్తూ ఉన్నాము, ఒత్తిడిని తట్టుకోలేక, సమస్యలకు తాళలేక,పదుగురిలో కలువలేక, ఒంటరితనాన్ని జయించలేక మధ్యలో తనువు చాలించేవారిని,లేదంటే దురలవాట్లకు బానిసలుగా మారి అటు తల్లిదండ్రులకు, ఇటు సమాజానికి చీడ పురుగులు గా మారుతున్నవారిని.అలాంటి సంఘటనలు ఎవరూ ఎదుర్కోకుండా ఉండాలన్నా,మానవతావాదం కలకాలం నిలబడాలన్నా, చిన్న నాటి నుండే పిల్లలకు క్రమశిక్షణ పెంచే ఆధ్యాత్మిక చింతన,పుస్తక పఠనం,ఆలోచింప చేసే ఆటలు,అనుబంధ బాంధవ్యాలకు సంబంధించిన విశేషాలు, సహాయ,సహకార,సాహస గాథలు వంటి విషయాలను నేర్పించాలి.ఈ ఒక్క వేసవి సెలవులనే కాదు.పిల్లలు పెరిగి, పెద్ద వారయి,తమ జీవితాన్ని తాము స్వాధీనంగా నడుపుకునేంత వరకు వీటి ప్రాధాన్యత, ప్రభావం వారిపై ఉండేలా చూడగలగాలి.

ఇప్పటికే మీ అందరితో చాలా విషయాలు పంచుకొన్నాను.ఏంటి ఇదంతా అని మాత్రం ఎవరూ అనుకోకూడద నే ఆశిస్తూ,ఆశల,ఆశయాల సాధనలో ఈ తరం చిన్నారులంతా, రేపటి పౌరులుగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ,



-పద్మ త్రిపురారి
సెల్: 965240 8848



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

### ధర్మ మార్గం

వినయము గా గొల్వ
మనసున ప్రేమగా తల్వ
మాతృ పితృ గురు దేవతల
మది దలపి ప్రసన్నతల
ఎల్లవేళల ఎమరక మరువక
హృది తృప్తి నొందునట్లుగ
సత్య వాక్యము లు స్మరింపు
నీదుధర్మబులు నిర్వర్తిస్తూ
ధర్మవ్యాధుని ధర్మ నిరతి
బోలిన యట్లు!
ధర్మ మార్గంబున చనిన
నీదు జన్మం ధన్యంబగు !

-పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

### పావురం కొద్ది

పంట పండించిన రైతు
కంటకన్నీరు కారుతోంది
గంజ్ లో దళారి వేలంపాటలో
సొమ్మసిల్లిన రైతు తనువు .
పండించిన ధాన్యం గంజ్ లో
అమ్మకానికి పెడితే
దళారి గద్దలు గుమిగూడి
మారు బేరగాళ్ల అరుపులగోల.
పసిబిడ్డలా పెంచిన పైరును
పావురం కొద్ది తీసిన దిగుబడి
బేరగాళ్లచేతులోనలిగినప్పుడు
విలవిలలాడిన రైతుల ప్రాణాలు
సాలు కష్టాన్ని కడుపున బిగ పట్టుకొని
కన్నీళ్లే దిగ మింగుడాయే .
భూమిని నమ్ముకున్న రైతు శ్రమ
పన్నీటి జల్లులే కురిపిస్త వనుకుంటే
కన్నీరు రెప్పల సూరుల పొంటి
వొలపోతల్లె మట్టిని తడుపుతై గాని
దళారుల గుండెలు కరగనంటవి.
ధాన్యం పండిచిన కర్షకుడి కష్టం
జనం చేతుల్లోకి ఎప్పుడు మారునో
తను పండించిన పంటకు
గిట్టుబాటు ధరను
తనే హక్కు దారుడై
నిర్ణయించునో
అప్పుడే రైతు రాజైతడు.

-యరకల యాదయ్య.
9866468979.

### ఫీనిక్స్

కవి చావడు
చంపుతాడంటావా?
చస్తే మళ్ళీపుట్టి
చంపుతాడు
వెధవల్ని మాత్రమే!

-కందుకూరి శ్రీరాములు
9440119245

### నీటి శాతం నేను !!


పుట్టినప్పటి నుండి
నా కడుపు
ఎన్నో నదుల నీళ్ల కూడలి !.
బుద్ధి తెలిసినప్పటి నుండి నా కన్నుల్లు
ఎన్నో సముద్రాల నీళ్లతో జలజంత్రం!.
అసలు నేనే వంద శాతం నీరు-
అందుకే కవినై హోరు హోరుగా నేను

-కందాళై రాఘవాచార్య 8790593638

### సెలవులు సెలవు తీసుకుంటే బాగుండు

మనసంతా తెలియని శూన్యం
ఏదో కోల్పోతున్నానన్న బాధ
ఒకప్పుడు ఎండకాలం సెలవులొస్తున్నాయంటే
ఎగిరి గంతేసేదానిని
కాని ఇప్పుడు ఆ కాలం వస్తుందన్న ఊహే
ఊహించని బాధని తెచ్చిపెడుతుంది.
ప్రతీసారి వేసవికాలం ఎప్పుడొస్తుందోనని
పాఠశాలకి సెలవులను తెచ్చిపెడుతుందోనని
ఆత్రుతతో అవధులు లేని
ఉత్సాహంతో ఎదురుచూసేదానిని
కాని ఇప్పుడేమో బడికి
సెలవులొస్తున్నాయంటేనే దుఃఖమొస్తుంది
ఇకముందు మా అందరిని
తమ సొంత పిల్లల్లా ఆదరించిన గురువులను
వదిలి వెళ్ళాలన్న నిజం
విషం కంటే వంద రెట్లు చేదుగా ఉంది.
అమ్మ కడుపులో నేను తొమ్మిది నెలలే ఉన్నా
కాని మా బడిలో పది సంవత్సరాలు
చిన్నపిల్లలాగే ఓ అమ్మ ఒడిలో ఉన్నట్లు
మా పాఠశాల ఒడిలో ఒదిగా కాని ఇప్పుడు
ఈ వేసవి కాలం సెలవులతో
పది సంవత్సరాల అనుబంధం తెగిపోతుంది.
ఇంక ఈ బాధని చెప్పడానికి
ఏ మాటా లేదు నా దగ్గర!
వేసవి సెలవులు వస్తే
ఇంతకుముందున్న ఇకపకలేవీ ఉండవు
మొన్నటి దాక స్నేహితులతో పెట్టిన ముచ్చట
వేసవి మంటల్లో కాలిపోతుంది
ప్రతి సంవత్సరం ఎంతో ఆనందాన్ని మిగిల్చిన
సెలవులు
ఈసారి మాత్రం మమ్మల్ని
పాఠశాలనుండి శాశ్వతంగా దూరం చేస్తాయి
ఈ సెలవులు సెలవు
తీసుకుంటే బాగుండనిపిస్తుంది

- పద్మ భవ్యశ్రీ



## ఎన్నెన్నో కోణాలు -ఎన్నెన్నో రూపాలు


కొన్ని గుణాలు, కొన్ని లక్షణాలు మాత్రమే
చూడగలం ఒక వ్యక్తిలో.
ఒక్కరిలో మాత్రమే చూడగలం ఎన్నెన్నో
రూపాలు... మరెన్నో కోణాలు.
సకల రూపాల సమన్వయం,
సకల సద్గుణాల
సంపన్నం ఆ వ్యక్తి.
ఆ వ్యక్తి ఎవరోకాదు...
అమృతమయి అమ్మ.
ఈ ప్రపంచంలో కళ్ళు తెరవగానే చూసిన
తొలి కిరణం అమ్మ.
నిస్వార్థమైన ప్రేమకు నిలువుటద్దం...
అనంతమైన అనురాగానికి నిదర్శనం.
లాలిలాలి అంటూ జోలపాటలతో
ఊయలలూపుతూనే
ప్రపంచాన్ని పరిచయం చేసే
తొలి గురువు.
అనారోగ్యపు సమయాన ఆ చేతి స్పర్శ
బాధను మరిపించే గొప్ప ఔషధం.
తప్పటడుగులు వేస్తూ పడిపోతే తన పాపడి
కన్నా ముందే తిరుగుతాయి
ఆమె కళ్ళలో నీళ్ళు.
వాడు నవ్వితే ఆమె కళ్ళలో
కోటి వెలుగుల కాంతులు.
ఎంత పెద్దయ్యాక అయినా
అమ్మ చీర కొంగు
చాటునే దాక్కొని ఉంటుంది బిడ్డ ధైర్యం.
తన పిల్లల కోసం ఏదైనా చేయగలిగే
సాహసం,
ఓడిపోని యుద్ధం అమ్మ.
చిన్న తనంలో వేసే తప్పటడుగులకు ఊతం,
పెద్దయ్యాక చేసే తప్పులను
సవరించి,తలనిమిరే
తల్లి...అనురాగవల్లి.
కలలు కనేది బిడ్డయినా,ఆ కలలకు రెక్కలు
తొడిగే మమకారపు పాలవెల్లి.
కష్టాలు ఎదురైనప్పుడు జారిపడే కన్నీటికి
ఆనకట్ట అమ్మ ఒడి.
బిడ్డకు సభ్యతా, సంస్కారాలను నేర్పే బడి.
అపజయాలు ఎదురైతే
అపహాస్యం చేసేవారే
అందరూ.
గెలిచినా ఓడినా ఒకేలా హత్తుకొని ఆదరించే
ఒకే ఒక వ్యక్తి అమ్మ.
అందరినీ ఆదరించి,
అన్నం పెట్టే అక్షయపాత్ర
అమ్మ.
ఆమె కళ్ళతో దీవిస్తే చాలు ఓటమి తల
వంచుకుంటుంది... కష్టం కరిగిపోతుంది.
అమ్మ ఉంటే చాలు
అన్ని సంపదలూ,సంతోషాలు
మనవద్దే....
కాలం మారవచ్చు...రాజులూ ,రాజ్యాలు
మారవచ్చు.
మారనిది ఒక్కటే... స్వచ్ఛమైన అమ్మ ప్రేమ,
అవధులు లేని ఆమె అనురాగం.
ఎందరెన్ని నిర్వచనాలు చెప్పినా,
నాకు నచ్చిన,
నేను మెచ్చిన , నేనిచ్చే నిర్వచనం ఒక్కటే.
అమ్మ...అమ్మకు తోడుగా నాన్న ఉన్నవారే ఈ
ప్రపంచంలో కుబేరులు.
ఆ అదృష్టం లేకుంటే ఎంతటి వారైనా
కుచేలురే.

-ఉమాదేవి ఇల్లెందుల

మాతృదినోత్సవం సందర్భంగా 'అమ్మ' శీర్షికన 'అక్షరయాన్' ఆహ్వానం మేరకు వచ్చిన కవితలు.. నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకం.

-సంపాదకులు

## అమ్మ కోసం ఆర్తనాదం



చీకటి పడిన ప్రతి సాయంత్రం
నా కన్నుల్లో వెలుగులు ఆరిపోతున్నాయి
నీ అడుగుల శబ్దం వినిపిస్తుందేమోనని
ప్రతి తలుపు వైపు నా చూపులు
పరిగెడుతున్నాయి.
ఒక్క సారి 'అమ్మా' అని పిలిస్తే
తిరిగి నా దగ్గరకు రాలేవా?
నువ్వు వినిపించని ఆనిశబ్దం
నా హృదయాన్ని ముక్కలుగా చీల్చేస్తుంది.
నీ ఒడిలో దాగి చెప్పుకున్న బాధలు
ఈ రోజు జ్ఞాపకాలై మెలిపెడుతున్నాయి
నీ చేతి స్పర్శ కోసం
నా ప్రాణం ప్రతిక్షణం తపిస్తోంది !.
నా గుండె గదులు ఖాళీగా ఉన్నాయి
ప్రేమ రక్తం నింపాలి
ఖాళీ గదుల్లో మొదలైన నొప్పి
నీ ఊహతో మరకై తగ్గింది!.
నువ్వు లేని ఈ ప్రపంచం
శూన్యమై నిలుస్తోంది
చుట్టూ ఎందరున్నా
నా మనసు నీకై వెతుకుతోంది !.
అమ్మా ఎక్కడ ఉన్నావు?
గాలిగా మారి స్పృశించవా?
చిగురాకై నా తలపై చేయి పెట్టవా?
మదిలో తలంపై ఊరటనిస్తావా
మాతృ దినోత్సవం నాడు అమ్మై వెలిగిపోతా!

-డా. కందేపి రాణీప్రసాద్



## "జగతిలో అమ్మ"

పల్లవి:: అమ్మ అన్నది కమ్మని పిలుపు
అది సృష్టిలోనే తీయని పలుకు
ప్రతి సృష్టికి మూలం తానైనది
ప్రకృతికి తానే తోడైనది.

అనురాగ కోవెలలో దేవతవమ్మా
మమతల పూతోటలో మరుమల్లె తీగమ్మా
మల్లెలవలె పరిమళించు
సుగంధాల విరిజల్లు
బంధాలుబాధ్యతలు
అల్లి నావమ్మ
గృహసీమ స్వర్గసీమజేయున మ్మా
బ్రతుకు నిచ్చు భరోసాను అందించునమ్మా.

అమ్మ మనసే హిమపాతం
సృష్టిలో అదే ఉన్నతం
కడుపులో పెట్టి మము సాకావు
కడవరకు ప్రేమ చెదరనీయవు
గెలుపులో నీవుంటావు
ప్రతి మలుపులో తోడుంటావు
ఏమిస్తే నీ ఋణము తీరునమ్మా.

అపురూపమైన ఆడజన్మ
నీదమ్మా
ఆ జన్మకు పరిపూర్ణత నిచ్చే
అమ్మతనం నీదమ్మా
పుట్టింటి మెట్టింటి శ్రీలక్ష్మి
నీవమ్మా
ఆదర్శమూర్తివమ్మా ఈ జగాన నీవమ్మా
గోరంత నొప్పికైనా
ఓదార్పు నీవమ్మా
కొండంత భారమైన భరించు అమ్మా
అమ్మ ప్రేమ ఆకాశమంత విశాలం
భూమాతంత ఓర్పు నీదమ్మా
కరుణామూర్తివి నీవమ్మా.

కనిపించే దైవం నీవమ్మా
స్వచ్ఛమైన ప్రేమకు రూపం నీవమ్మా
సమతా కాంతుల దీపమమ్మా
అక్షరాలకు అందని భావమమ్మా
ఋతువులు మారినా మారనిది నీ ప్రేమ
యుగాలు గడిచినా తరగనిది నీ మమత
నిను కొలుచుటే ఈ జన్మకు సార్థకృత..

-జి, సూర్యకాంతి

## ప్రణామం -ప్రణామం

ప్రణామం..ప్రణామం ... ప్రణామం...
ప్రత్యక్ష దైవానికి ప్రణామం
వందనం వందనం.. వందనం... కనిపించే దేవతకి వందనం
అవనిపైన అందమైన పదానికి ప్రణామం
'కనిపెంచే' 'కనిపించే' కన్నతల్లికి వందనం ....॥ప్రణామం॥

చరణం : నాదమైన వేదమైన నా తల్లికి ప్రణామం
పల్లవించే పాటయైన ప్రణయమూర్తి కి ప్రణామం
రవళిలించే రాగమైన గీతానికి ప్రణామం
కనిపించని ప్రాణ వాయువై కాపాడే కరుణా మూర్తి కి ప్రణామం
రోతయైన రోదనైన మన్నించిన మాతృమూర్తికి ప్రణామం
వెలకట్టలేని విలువైన సేవలకు ప్రణామం ॥ప్రణామం॥.

ఇంటిలో అణువణువున అద్దమైన ప్రతిబింబానికి ప్రణామం
ప్రతి బిడ్డ పెదాలపై నర్తించే నవ్వైన నాతల్లి చరణాలకు
ప్రణామం
ఏడ్చే శిశువునైన మాయ జేసి నవ్వించే మంత్రానికి ప్రణామం
నాలుకపై నర్తించే నాదమైన పిలుపునకు ప్రణామం
వేదమై ఘోషించే పిలుపునకు ప్రణామం ॥ప్రణామం॥.

కష్టాల్లో కలతల్లో కన్నీరైన కరుణా సింధువుకు ప్రణామం
ఊపిరై .. ఉత్తేజమై స్ఫూర్తి నిచ్చే మంత్రానికి ప్రణామం
కన్నబిడ్డ కన్నీరు కనిపించకుండా మాయం చేసే మాజిక్
మమతలకు ప్రణామం
కనురెప్పల వెనక కన్నీటి సాగారాలున్నా
చిరునవ్వైన నట శిరోమణి కి ప్రణామం.



కల్పవృక్షమై కామధేనువై కలతల బాపే
కారుణ్యమూర్తికి వందనం ....
కరములు కై మోడ్చి శిరస్సును వంచి
వేనవేల కోటి వందనా లూ ...
ప్రశాంతత నిచ్చే పాదకమలాలకు ....
అమృతచర ణాలకు......
శతసహస్ర కోటి వందనాలు.....
శిరసాభివందనాలు ...
పాదాభివందనాలు ...చరణా బివందనాలు .....

-నామాని సుజనా దేవి



## అమ్మ

ప్రాణమొడ్డి
ప్రాణమోసె
ప్రణవమె అమ్మ.

పాలబువ్వపెట్టి
జాబిలికథచెప్పె
పాలవెల్లిఅమ్మ.

లాలపోసినీతి
లాలనతోరీతితెల్పె
పరిపాలిక అమ్మ.

అడ్డదారివద్దు
రహదారెకద్దనె
మార్గదర్శిఅమ్మ.

తప్పు తీసి
ఒప్పుగ కూడె
అగణిత అమ్మ.

కడుపుమంటని
కడుపుపంటనే
క్షమా ధాత్రి అమ్మ.

వలువలుకట్టి
విలువలుచుట్టె
కట్టుబాటుఅమ్మ.

బుద్ధి సుద్దులు
బుజ్జగించి తెలిపే
తెలిగురువుఅమ్మ.

ఆశయాలతో
ఆచరణలసాగనే
అభ్యుదయఅమ్మ.


వనకావ్యంలో
కరుణరసమొలికె
సత్యపదంఅమ్మ.

ప్రేమస్వరాన
మమతశృతిచేసే
రాగచంద్రకఅమ్మ.

ఒడికన్నఒడినే
కన్నుమూయలనే
ఆశాజీవిఅమ్మ.

-రామలక్ష్మీమోచర్ల

## అమ్మ



ఉ.చల్లని గర్భమందు
తన ఛాయను నిండుగ మోయుదైవమై
కొల్లగ ప్రేమబంచి పసికూనల సాకెడు నీడయౌను,తాఁ
జెల్లని మాటలాడదిక, చెల్మిని బెంచెడు సాధనమ్ము నా
తల్లికి సాటిలేరు,శుభదాయినియన్చన నమ్మయే సుమా!

కం. బరువని దింపదు బిడ్డను
నిరవుగ తనగర్భమందు నిచ్చగ మోయున్
సరియగు పోషణ నిచ్చును
మురిపాలను పంచు తల్లి! మూలము తానై.

కం. కోరదు ప్రతిఫలమెన్నడు
మీరదు తన ధర్మమెపుడు,మెదలును చెలిమిన్
పారదు కష్టములందున
దారిని తప్పంగనీక దక్షత నేర్పున్.



కం.తానేమైనను గానీ!
రానీయదు కష్టములను రక్షణతానై
వేనోళ్ళు పొగుడు చున్నను
తానేర్పును మంచి,చెడుల తనసంతులకున్.

తే.గీ.పేగుబంధము పెనవేయ ప్రేమమీర
కాలధర్మము నెరవేర్చఁ గదులునట్లు
కన్నవారిని బెంచుచు కాంతినింపు
తల్లి దండ్రుల కన్నను దైవమెవరు?

-పద్మావతి పొడిచేటి

## నువ్వు లేని నేను


మాటేందుకో మూగబోయింది
అడుగేందుకో తడబడుతుంది
చూపేదో వెతుకుతుంది
మనస్సేమో ఏడుస్తుంది
నన్నేదే వెక్కిరిస్తుంది.
ఆ చూపులు ప్రశ్నిస్తున్నాయి
ఈ మాటాలు వెక్కిరిస్తున్నాయి
నీదీ ఓ బతుకేనా అని..
నాకేందుకు నువ్వు దూరమయ్యావో
కాలం కాటుకు నేనేందుకు బలయ్యానో
క్షణం ఓ యుగంలా..
ప్రతి గడియా ఓ సుడిగుండంలా
ప్రతి అడుగు ఓ ముళ్లదారిలా
ఇంకెన్నాళ్లు ఈ జీవితం.
అమ్మా నువ్వులేని నేను
సమాజమనే సంద్రంలో ఒంటరి నావను
నావికుడు లేక.. ఒడ్డుకు చేరుకోక
ఏన్నేళ్లాని ఈ ప్రయాణం..
ఏన్నాళ్లాని ఈ నరకం.
బందువులందరూ తోడేలై
చుట్టు ఉన్నవాళ్లు గుంటనక్కలై
రక్తం పీల్చుకు తింటుంటే
ఒంటరి ప్రయాణంలో ఎన్నేళ్లు



ఈ పోరాటం.. గెలుస్తానో ఓడుతానో
తెలియక.. ఉక్కిరిబిక్కిరౌతున్న ఊపిరికి
నేనమని ధైర్యం చెప్పనూ..
పున్నమి వెన్నెల్లో అమావాస్య చీకట్లు
నా జీవితాన్ని కమ్మేశాయి..
వడగాలై చంద్రుని వెన్నెల వేదిస్తుంటే
చావాలో బతకాలో తెలియక
ఈ క్షణమైనా కాపడడానికి సుడిగాలై
నువ్వోస్తావని ఏదురుచూసి.. ఏదురుచూసి
ఏరుపెక్కిన నా కళ్లకు కన్నీళ్లు కరువై
రక్తం రాకూండా ఆగదేమో మరి..
అమ్మా నువ్వులేని జీవితం శూన్యమే
అయినా ఆ శూన్యంలోనే
సుందరమైన నీ రూపం
ప్రతిబింబిస్తుంది. నిండు చంద్రునివోలే
అందుకే ఎంత కష్టమైనా..
నీ రూపం కోసం
ఆ శూన్యంలో
నిన్ను నిలుపుకోవడం కోసం
రెక్కలు ముక్కలు చేసుకుని
రాత్రనకా పగలనకా
కష్టపడుతున్నా.. ఏడారిలో కోయిలై..
అమ్మా నేనెందరిలో ఉన్నా.. ఏం సాధించినా..
నేనేప్పటికీ వెలుతురు లేని వెన్నెలనే
నువ్వు లేని నేను రాజ్యం లేని రాణినే

-అమీనా కలందర్

## అమ్మ



పునరుత్థానం
ఉదయ కిరణాల కెరటాలపై తూగే
వన్నెల స్వప్నాల నావలా,
కోకిలమ్మ పాటలతో తరలి వచ్చిన
వర్ణశోభిత చైత్రరథంలా,
మంచి గంధపు దారుల్లోకి
నిశ్శబ్దంగా నడిచొచ్చిన
నిండు పున్నమిలా,
నాతలపుల పూలజల్లుల పరవశంతో,
అరమోడ్పు కన్నులతో
కడుపును స్పర్శించుకుంటున్న నీరూపం
ఇంకా నా ఊహల్లో తాజాగా ఉంది.
నీలో ఒదిగి మెదులుతూ, కదులుతూ,
పల్టీలు కొడుతూ, దూకుతూ, మెలితిరుగుతూ
ఈదుతూ, ఆవులిస్తూ, నిద్రిస్తూ, వింటూ
నేను అల్లరి చేస్తున్నప్పుడు
మందహాసంతో నువ్వు అందించిన వెచ్చదనం
ఇంకా నన్ను స్పర్శిస్తూనే వుంది.




మృత్యుశీతల పరిష్వంగాన్ని ఛేదిస్తూ
నీమృదు అధరాల మధ్య బాధను
బంధిస్తూ
సృజనకూ, మరణానికీ మధ్య
లోలకంలా తిరుగుతూ
నన్నీ భువి పైకి తరలించి
నా అణువణువు పై నువ్వు కురిపించిన ముద్దుల తడి
ఇంకా ఆరలేదు.
పరచుకున్న పచ్చని పైరుల్ని పలకరిస్తూ,
హరితవనాల ప్రాణవాయువును
ఆస్వాదిస్తూ,
పెరటి తోటలో పాదులు చేస్తూ,
చిలికి చిలికి తీసిన వెన్న ముద్దల్ని
వెండిగిన్నెలోకి తీస్తూ,
స్వేదం తో తడిచిన నీ మెడను చుట్టుకుని ఉయ్యాలలూగిన
నన్నింకా ఆ లయ ఊపుతూనేఉంది.
చుక్కల పందిరి క్రింద
నన్ను ఒడిలో పొదవుకుని, గోరుముద్దలు తినిపిస్తూ,
నువ్వు జాబిల్లి వంక చూపించినప్పుడు, ఆకాశంలో కాక
నీ కళ్ళల్లో కనిపించిన జాబిలమ్మ
ఇంకా అక్కడే చిరునవ్వులు చిందిస్తూంది.
నేను బుడి బుడి నడకలు నేర్చుకుంటున్నప్పుడు
నావేలిని అందుకుని
బ్రతుకు బాటలోకి నడిపించిన నీ వేలు
నాగమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించి,
ఒక్కొక్క మెట్టునూ పదిలంగా ఎక్కించి నా చేతికి
జయ పతాకను అందించింది.
నన్ను పలకరించిన ప్రతి భాగ్య వీచిక లోనూ
నీ ఆశీస్సుల పన్నీరును చిలకరించింది.



బ్రతుకులో కరిమబ్బులు కమ్మినప్పుడు,
సమస్యల చీకటి గదిలో బందీనై
కాంతిపుంజాలకోసం పరితపిస్తున్నప్పుడు,
నువ్వు వెలిగించిన ఆశల దివ్వెలు
నాదారిని దీప్తివంతం చేసాయి.
అమ్మా!
నువ్వు నాకు బ్రతుకునిచ్చావు
బ్రతకడం నేర్పావు..ఎదగడం నేర్పావు,
శిఖరాలపైకి ఎగబాకడం నేర్పావు
రెక్కలు విప్పిన విహంగం లా
విజయాల సందిట్లోకి ఎగరడం నేర్పావు.
కాని..నువ్వు నేర్పినవే తప్ప నేను
స్వయంగా నేర్చుకోవాల్సిన నైపుణ్యాలను నేర్చుకోనేలేదు,
జీవితోత్సవపు సుస్వరాల్ని సృజించే
సరిగమల్ని మీటడం నేర్చుకోనేలేదు.
అమ్మను, అర్ధాంగినీ సన్నిహితంచేసి
వారి అనురాగ ఆలాపనల్ని ఏకంచేసి
ఒక సుమనోహర సుమధుర రాగాన్ని
సృజించుకునే నిపుణతను సాధించుకోనే లేదు.
"నేను" కేంద్రంగా నువ్వు, నీకోడలు
స్పర్ధల గోడల్ని నిర్మించుకుంటూంటే
వాటిని నివారించడం,నిర్మూలించడం
ఎలాగో తెలియని అయోమయంలో కూరుకుని



తరతరాలుగా పురుషజాతి
సృష్టించి, అనుసరిస్తున్న
అమానవీయ భావ సుడిగుండంలో
పడకుండా తప్పించుకోలేక,
"స్త్రీకి స్త్రీయే శత్రువు" అనే
పాత మురికి పాటనే జపిస్తూ,
స్త్రీ జాతిని విభజించి పాలించే
దుష్ట పితృస్వామ్య బాకాను
నిశ్శబ్దం చేసే వివేకం లేక,
నాలోని కొడుకుతోపాటు "మనిషి" కూడా మాయమై
గురిపెట్టి విసిరిన బాణం గుచ్చుకున్న గువ్వ
పిట్టలా విలవిలలాడుతున్న నిన్ను వృద్ధాశ్రమంలోకి నెట్టేసి
జడమై ఒరిగిన ఆత్మతో ఒంటరిగా ఇంటికి చేరాక
నువ్వు లేని మహాశూన్యం నన్ను ఒణికించింది.
నీచూపు, నీపిలుపు,
నీ స్పర్శ లేని బ్రతుకు నన్ను భీతిల్ల జేసింది.
నీనయనాల్లో ఘనీభవించిన పెను విషాద హిమజ్వాల
నన్ను వెంటాడి, వెంటాడి
మత్తిల్లిన నా అంతరాత్మను మధించింది.
పేరుకున్నమలిన విష భావాల్ని దహించింది.
పునరుత్థానం చెందిన "వివేకం" మెల్లగా కళ్ళు విప్పింది,
నీస్మృతుల సుధామధుర గానం
రోదిస్తున్న నాహృదయాన్ని ఊరడించింది?



మావిచిగుళ్ళను తాకి వచ్చిన చిరుగాలి
తెగిపడిన పూలసరంలా ఉన్న
నామనసును సేదదీర్చింది,
తరలివచ్చిన వసంతహేల ధైర్యం చెప్పి
నీ సమక్షానికి నన్ను చేర్చింది
నీ క్షమతో పునీతుడయే ఈ పురుషుడు
తల్లిగా, చెల్లిగా, పత్నిగా, పుత్రికగా,
అత్తగా, కోడలిగా సామాజీకరింపబడి
కలహాల ఊబిలో చిక్కుకొని దూరమవుతున్న స్త్రీ మూర్తులను
స్నేహంతో, సౌజన్యంతో, సహృదయంతో సన్నిహితం చేసే
శాంతి, సౌభాగ్య, సంతోషాల
సృజనోత్సవానికి నీ కుమారుడు సూత్రధారి అవుతాడు
విభజనలు లేని భవ్య సంస్కృతిలోపాత్రధారి అవుతాడు.
ఆ వెలుగు దారుల్లోకినీనందనుడిని నడిపించడానికి
దీపధారివై నీ ఇంటికి తిరిగి రామ్మా!

-డా. ఆలూరి విజయలక్ష్మి

మిగతా 4వ పేజీలో...

3వ పేజీ తరువాయి..

## వేరుమూలం

సంతానాన్ని గర్భంలో మోస్తుంది..
కుటుంబ భారాన్ని తలకెత్తుకుంటుంది..
కుటుంబానికి వేరుమూలం అమ్మ!.
ఆవేదనల ముళ్ల మధ్యనైనా..
చిరునవ్వులు చిందించగల
ప్రేమపుష్పం అమ్మ!.
అభిశంసనల రాళ్లు విసిరినా..
మమకారపు మాధుర్యాన్ని
ఒలికించే మధుర ఫలం అమ్మ!.
సమస్యల కఠిన జలాన్ని తాను సేవించి..
ప్రియవచన భాష్పోత్సేకంతో
ఓదార్చే ఒడి అమ్మ!.
ఎండుకట్టెగా తాను మారినా,
మమతానుబంధాల ఊటయి..
నిలుచున్న చోట నీడనిచ్చే అమ్మ!.
సంతాన సంతోషమే ఆమె స్వర్గం!
వారి దుఃఖమే ఆమెకు నరకం!.
దూరాన ఉన్నా,దండిగా
దీవెనలు అందించే..
చిరునవ్వుతో వరాలను కురిపించే..
పూజా పునస్కారాలను అడగని..
స్తుతి స్తోత్రాలను ఆశించని,
సేవా నైవేద్యాలను కోరుకోని..
'గుడి లేని దైవమే' కదా అమ్మ!.
అమ్మ హృదయమొక మమతల కోవెల..
క్షమ,ప్రేమలే
ఆమె గుండె 'లబ్' 'డబ్' లు !!.

–చంద్రకళ దీకొండ

## అమ్మ

అమ్మంటే అన్నీ ఉన్నట్లే.
అమ్మ లేని జీవితం అంధకార బంధం.
10 నెలలు మోసి పాలిచ్చి పెంచిన తల్లి.
మాటలతో పాటు మమతల ఎన్నో
పంచుతుంది.
మనసు ఊయలలో ఊపుతుంది.
అమ్మను మించిన దైవం లేదు.
ఎన్ని జన్మలైనా తీరని రుణమే లేదు.
అనుబంధాలకు వారధిలా
వయసంతా అరగ తీసుకొని
అందమంతా కరిగించుకొని
అనుబంధాల కోసం
జీవితమంతా పాటుపడిన మాతృమూర్తి.
వయసుడికి నా వృద్ధాప్యంలో
అమ్మకు చేయూతగా
కర్ర సాయమై ఆసరాగా నిలవాలి.
పసిపిల్లల లాలించి పాప లాగా చూడాలి.
అమ్మంటే అమృతభాండం.
పచ్చని చెట్టు లాగా జీవితం ఇస్తుంది.
అన్నిటికన్నా బంధమే మిన్నంటూ
బాధ్యతగా మసులుతుంది.
ఉగ్గుపాలు పట్టి ఊయల లూపుతుంది.
అపురూపంగా పెంచిన తల్లి నిస్వార్థ ప్రేమకు
మారుపేరు.
అమ్మ న పిలుపులో విశ్వమే దాగివుండి.
ఆ విశ్వాన్ని నడిపించేది అమ్మ.
అందరికీ ఆదర్శనీయం.
ఆఖరి నిమిషంలోనైనా ప్రక్షాళన చేసుకుని
మరణం లో చేరువై సాగనంపి తే
అమ్మ రుణం తీర్చుకున్నట్లే.

–తాటి కోల పద్మావతి.

## అమ్మ (మాతృ దేవత )

మాతృదేవత పదముల కిదే వందనం
మముగన్న తల్లి నీకిదే వందనం.
ముద్దుగా బిడ్డను కననెంచి
మృత్యు దేవతకు తలవంచి
తలగడ వైపు తనకు నెలవిచ్చి
క్షణమో మరి మరు క్షణమో.
నువు తీసే ఊపిరి బహు భారం
వచ్చే నొప్పులు మరీ ఘోరం
తల్లడిల్లుతూ చావుతో భేటీ పడ్డు
తల్లి కావాలని మిన్నగు తపనతో.
నీప్రాణాలు పోసి నా ప్రాణాలు నిలిపి
మాకు సూక్ష్మ బుద్ధిమతిని నేర్పి
బిడ్డలుగు కనిపెంచి వృద్ధి చేసినావు
ఏమిచ్చిన తీరని నీరుణం తీర్చుకోదల్చి.
ముసలితననీ మరోబాల్యమే తల్లి
అట్టి నీకు నేనో కన్నతల్లినై
కరుణ ప్రదీపమైననీ కనుసన్నలే
నాకాదేశమై నేను నీకుఅమ్మనై.
ప్రేమ మీరగ పసిపాపను చేసి
ప్రియలాలలు పోసి లాలిస్తు
ఆత్మీయతా సుమాలర్పించి
తీరని నీరుణం తీరే యత్నమే
కృతజ్ఞతాభి వందనాల మాలగా.
అందుకో తల్లి నీకిదే వందనం.

–బందు విజయ కుమారి

## అవును ఆమె అమ్మ!



ఇల్లాలి సంతకం చేసేసి
పిల్లలకోసం భరించేస్తది
అవును ఆమె అమ్మ ....!.
బాసు రంకెలేసి
బేజారు చేస్తుంటే
లంచ్ బాక్సు బ్యాగులో
మూలుగుతుంటే
ఆరైందని ఉరికి ఉరికి
ఇల్లుచేరి వంటింట్లో దూరి
పిల్లలకు వండి వార్చి
తానొక మెతుకైనా గతకలేదని
యాదిమరిచి పోతది
అవునుఆమె అమ్మ ...!.
మాట వినని బిడ్డకు
బుద్ధిచెప్పమని
నాన్నకు ఫిర్యాదు చేసి
తీరా అయ్య కొడితే
ఓర్వలేక వెక్కి ఏడుస్తది
అవునుఆమె అమ్మ ....!.
గిన్నె ఖాళీఅయి
చికెనంత అయిపోతే
కడుపు మంచిగలేదని
సల్ల పోసుకుని సర్దుకు తింటది
అవును ఆమె అమ్మ .....!
తాగి తందనాలాడి
తల్లి దండ్రులను తరిమి కొట్టినా
నానా బాధలు పెట్టినా
నా కొడుకు బంగారం
ఎవరో చెడగొట్టిన్రు అని
మందిని ఆడిపోసుకుంటది
అవును ఆమె అమ్మ ......
కట్టుకున్నోడు కనికరం మరిచినా
దేశాలు పట్టుకుపోయినా
వాడి దారి వాడు చూసుకున్నా
కూడుగుడ్డ లేక అల్లాడితే
సాకలేక దిగాలైపోతే
పిల్లలను బాయిలో వేసి
తాను కూడా దూకుతది
పిల్లలను ఆడకూడా ఇడవది
అవును ఆమె అమ్మ .......!
తనబిడ్డలకై
ప్రాణాలే ఇస్తది
ప్రాణాలు కూడా
తీస్తది
అవును ఆమె అమ్మ...!

–రమాదేవి కులకర్ణి

## గదిలో గుండె గుడిలో

'అ' మ్మా అంటూ 'ఆ' ప్యాయంగా పిలిస్తే
'ఇ' ల్లాలుగా ఇంటి దీపంగా
'ఈ' శుని ప్రతిరూపంగా నాఎదుట నిలిచిన అమ్మ
'ఉ' య్యాల్లో వేసి 'ఊ' పి జోలపాడిందామె
'ఋ' ణంతీర్చుకోలేని,ఋకలతో కొలవలేని ధన్యజీవి ఆమె
'ఎ' క్కడున్నా ఏ మాత్రం మరవని ఆమె ఆకృతి
'ఐ' తే గియితే జన్మ జన్మలకూ
'ఒ' కే ఒక్క, ఓ అంటూ బదులిచ్చే, 'ఔ' నన్నా కాదన్నా
నాజీవితపు పూలకొమ్మ
'అం' దరికీ అమ్మ, ప్రకృతిలో ఆకృతిగా పరమేశ్వరి.
'క' నులనీరు తుడిచి ఖరముపాలతో, రోగనివారణచేసిన గృహ వైద్యురాలు
'గ' డప ముందు ముగ్గులో ఘనంగా పలకరించు,
'చ' క్కని గాత్రంతో జోకొట్టి ఛత్రంలా నిలిచిన వృక్షం
'జ' లాల్లో గంగానది,ఝషంలా నాకంటిపాపలో సదా కదలాడు
'ట' క్కు టెక్కు పోవద్దని పనికి ఠలాయించకని హెచ్చరించు
'డ'మరుకంలా ఆమె గళం
ఢంకా బజాయించి ఇచ్చింది ధైర్యం,ణ కారం ఆమెస్వరం
'త' న పరభేదమెంచని 'ద' యచుట్టమని, ధనంతో విద్యకొనలేమన్నది
'న' కారాత్మక భావాలొద్దు,
'ప× సిడితెలుగులో పలికి ఫక్కున పాపాయిలా నవ్వుల పువ్వుల రువ్వింది
'బ' డి,గుడిలో దైవం ,భరించింది నా అల్లరి
'మ' మతల మల్లియ, 'య' మున ఒడ్డున మ్రోగిన మురళి
'ర' వళించు అందియలు, లక్ష్యసాధనకై ప్రోత్సాహించిన
అమ్మ నాజీవితపు కొమ్మ రెమ్మ!



'వ' రుసగా పాటలు కట్టి శబ్దాల
అర్థాలు తెలిపే,
'ష' డ్రుచులు ఆరు ఋతువుల
'స' హనం సహిష్ణుత ఆమెసొమ్ము
'హ' లంతో కలంతో నేటి మహిళలకాదర్శం
'ళ' కార గుణింతం నేర్పే
'క్ష' యం కాని అక్షర మాలిక
'ఱ' వాడుకలో లేకున్నా,బ్రతుకు బాటలో బండిలా సాగిపో అని
గుణింతాల గణితం నేర్పె అమ్మ
సదా నామదిలో గుండె గుడిలో
పరమేశ్వరి ప్రతిరూపం ఆమె,అమ్మ

–అచ్యుతుని రాజ్యశ్రీ

## ఓ..అమ్మో!! అవ్వ!!

నీ చీరకొంగు
నాకు తువ్వాల
నీ ఒడి నాకు ఉయ్యాల.
నీ నడుము నాకు కుర్సీపీట
నీ మాట నాకు లాలిపాట.
అమ !!
నీ సూపు చంద్రుని లెక్క
నీ కుంకుం సూర్యుని లెక్క
నీ సీర పచ్చటి పొలం లెక్క
నీ సిగ కారుమబ్బు లెక్క.
ఓ అమో !!
నీ కోపం తాటాకుఅగ్గి
నీ పేమ సల్ల సుక్క
నీ సిరునవ్వు కాసుల పేరు
నీ కాలిగజ్జె నట్టింట జోరు.
ఓ అమ్మ!!
నీ గుండెకు మెత్తబడెను రాతిబండ
నీ ధైర్నమే మాకు పేద్ద అండ.
నీ సేతి వంట
నాకు సెప్పలేనంత ఇట్టం
నీ తిట్లు నే ఓపలేనంత కట్టం.

–సాధన. తేరాల

## "మాతృదినోత్సవ శుభాకాంక్షలు" అమ్మ!

భూమి మీద పడగానె ఆకలొకటె తెలిసింది!
పొట్ట తడిమి పాలు గుడుపు అమ్మ ప్రేమ దొరికింది!.
తల్లి పదవికై ప్రాణం పణంగాను పెడుతుంది!
ఆపదొస్తె ఆడపులిగ మారి రక్ష నిస్తుంది!.
శయ్యపైన పొర్లాడే పరాధీన శైశవాలు!
తిండి నిద్ర మానేసిన తన త్యాగం పెంచింది!.
సంకటాలు సంబరాలు తోచదమ్మకు చెప్పక!
అభయమిచ్చి హత్తుకుంటు అనురాగం పంచింది!.
పట్టభద్రుని జేయగా గట్టి పట్టు పడుతుంది!
పట్టుచీర కొనుక్కోను వాయిదాలు వేస్తుంది!.
బతుకుబాట పోరులోన విజేతవై గెలువంగ!
అహరహమూ దైవానికి అర్జీలను పెడుతుంది!.
ఆశించక ప్రేమపంచు ఒకేఒక్క తోడురా!
అమ్మలేని అనాథలను చూడ జాలి వేస్తుంది!.
గడ్డమొచ్చి బిడ్డతనను అడ్డంగా అనుకుంటె,
గుడ్లనీరు కుక్కుకుంటు నిష్క్రమింప చూస్తుంది!.
కూతురనుచు కూర్మిజూప కంటిబెదురు తరిమింది!
ఆలుమగల మధ్య కుసుమ దూరలేక జరిగింది!

–కుసుమ ఉప్పలపాటి

మాతృదినోత్సవం సందర్భంగా 'అమ్మ' శీర్షికన 'అక్షరయాన్' ఆహ్వానం మేరకు వచ్చిన కవితలు..
నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకం
–సంపాదకులు



## బతుకు పోరు

పొద్దు పొడవంగ అమ్మ
చాట చీపురు నెత్తినేసుకొని
జీవన రూకల కోసం పయణం
పాత కల్లాలు ఎతికి పట్టి
బండెడు పొల్లు తూర్పాలబట్టి
చారెడు గింజలు దొరకబడతది
కన్నుగుట్టిన సూరీడు
మబ్బుల వలువలు ఇడిసి
నిప్పులు చెరుగుతూ దాడికి దిగుతడు
చింపుల చీర కొంగును తలపై
ఆయుధంగా మలచి భానుడితో
పొద్దంతా యుద్ధంజేస్తది
అలసిన అరుణోదయం భయంతో
పడమటి కొండల్లోకి జారుకుంటది
నవజాత పక్షికి తల్లి పక్షి
నోటితో తెచ్చిన ఆహారం
పిల్లల నోటికి అందించినట్లు
బతుకుపోరులో ఏరిన గింజలు
అపురూపంగా ఒడిసి పట్టుకొని
యద్ధ భూమిని ముద్దాడిన విజయ గర్వంతో
దారంతా రక్త తర్పణం చేస్తూ
మాకై ఇల్లు చేరిన నీ పాదాలు
కన్నీటితో కడిగినా ఋణం తీరునా...!!!
అమ్మా నీ ఋణం తీరునా....!!

–డా॥ తాళ్ళపల్లి యాకమ్మ

## నీవో సమస్తానివి

చీకటి గుహలో పొంచిన
నా కోసం వెలుతురు దుప్పటి పరిచి
కలల సముద్రంలో
అలలపై తేలియాడావ్ కదూ.
సూదుల్లా పొడిచే నిదుర కళ్ళతో
ఎన్ని వేల రాత్రులను పగళ్ళను
రాగరంజితం చేసి అందించావో
నీ కోరికల మెత్తటి తివాచీపై
నా నునులేత పాదాల
అడుగులు వేయించావ్.
తప్పటడుగులు మొదలు
వెన్ను నిటారు చేసేదాకా
కోరలు చాచిన ముసుగు ముఖాల మకిలిని
వేయి చేతులై తుడిచిపెట్టే కాళికవు
నన్ను కనిపెట్టుకునే దీపశిఖవు.
నీవు చూపిన దారుల్లో నీవు చూపిన మార్గంలో
కొత్తగా అడుగులు వేయ ప్రయత్నిస్తున్నాను ఒంటరిగానే.
నీవు పరిచయించిన ప్రపంచంలో
నాదైన దృష్టితో మిణుగురులా
ప్రకాశించాలనుకుంటున్నాను.



రెక్కల ఇంధనమే నీవైనప్పుడు
నీ ప్రతిబింబమే నేనైనప్పుడు
భూతలంపై పాదమెక్కడ మోపినా
పేగు బంధం కలిపే ఉంచుతుందని మరిచావా
మనమధ్య ముళ్లకంచెలేల చెప్పు
నీవో అలుపెరుగని యోధవని నాకు తెలుసు.
నా చిన్న గెలుపు వసంతానికై
నీ గుండె గుమ్మానికి ప్రమిదలు వెలిగించే ప్రకాశానివి
ఏ గుబులు చీకట్లు నిన్ను అలుముకున్నాయో
అవి శ్రావణ మేఘాల కుమ్మరింతలో కొట్టుకుపోవాలి.
అమ్మా నీవో మలయ సమీరం
నా ఉషోదయపు పసిడి కిరణాల సంతకం
నా ఆంతర్య సమూహానివి నా జీవిత సమస్తానివి

– నస్రీన్ ఖాన్

## అమ్మ! విశ్వ జనని !

విశ్వమంతా నీవే నిండి వున్నప్పుడు
ఏ ఉలి, ఏ కుంచె ఏ కళాపటిమ నీ రూపాన్ని
ఆవిష్కరించగలదు ?
అమ్మ ఆధరము ప్రేమ మమతాప్యాయతలను
ఏ తులామానంతూచగలదు ?
ఆకలిని హత్తుకొని కడుపు నింపుకునే నీకు
ఏ పరమాన్నం నైవేద్యం కాగలదు ?
నిరంతరం లాలించే జోలపాటకు విరామం ఇవ్వనిదే
నేనెలా నీకు లాలి పాడను ?
నా కన్నుల నిండా నీవే నిండి నా కన్నీళ్ళకు ఆనకట్ట వేస్తావు.
దారి మరల్చి ధారలను నీ కళ్ళలో ఒంపుకొని
చిరునవ్వుల అలలు సృష్టిస్తావు
సర్వార్థ సంభవో దేహః జనితం పోషితోయతః
అన్ని కార్యములకు ఉపకరించే
ఈ దేహమును ఇచ్చి, పోషించి
నీవందించిన అనుభూతులన్నీ
అనంత అక్షర రాశులైనపుడు
ఏ అక్షరం తిలకించగలను ?
అమ్మ కమ్మని విరివాన ఏ గాత్రము ఆలపించగలదు ?
తల్లి ఒక వ్యక్తి కాదు ... మహోన్నత సంస్థ...
మహాశక్తి... అత్యద్భుత సుందర భావన...
తనువు రక్తమంతా చనుబాలుగా మార్చి
గుండె పిండి నిండుగా పాలిచ్చు
పరుల బిడ్డలనక క్షీరము పొంగించు.. స్తనములనందించి...
విశ్వమాత ! విస్తృత పరిధి!
దేవుడు లేడను నాస్తికుడున్నాడు,
కాని అమ్మ జగత్ సత్యమే కదా ! అమ్మే జగత్తు...
అమ్మ నిరంతర సృష్టి వాహిని, నిర్విరామ శ్రామిక...
అమ్మ కుంతి... గ్రుడ్డి... బిక్షువు...
విరాగి... వేశ్య... నర్తకి...
అశుద్ధ ప్రక్షాళిని... సేవిక..ప్రేమ విభావరి...
కరుణా దీప ప్లావితం ఉత్పాధ్యం...
ఆది గురువు... సహస్రకోటి నామ రూపిణి...
అద్యనంతము.. లాలన... పోషణ... శిక్షణ (రక్షణ)
కర్మత్రయముల నిర్వాహ కర్త..
ఆశయం, దీవెన..
ఋణభారం మోపని...
బేరసారాలు లేని.. అనురాగ బంధం చావుతోటి పోరి,
జన్మనిచ్చిన తల్లి తండ్రి చూడకున్నా
సమస్తము తానై శ్రమించు..
వైదిక వాంగ్మయం" "మాతృదేవోభవ" అని శాసించింది
కన్నబిడ్డలకై శిఖరాలు ప్రాకగలదు
లోతైన లోయలు దిగజారగలదు..
నీ సంరక్షణలో ఎంత ఎత్తు ఎదిగినా...
గొప్ప పదవోన్నతి పొందినా
కుదురుగా కుదుర్చుకున్న నీ దివ్యలోకంలో
పదిలంగా దాచుకున్న సూక్ష్మజీవాణువుల్లో
విశ్వరసాయన సమ్మేళన అంగమానంగ సంగతను...
అద్భుతాశ్చర్యంగా అణువులు ఒదుగుతూ
సహస్ర కాంతుల బ్రహ్మాండ పిండమై
పెరిగి ముద్దు రూప దాల్చిన నీ శిశువునమ్మా...!
రక్తలాలిత్యంలో గర్భ బంధనాలలో
పెన వేసుకుంటున్న ప్రేమ ప్రదీపక
వెలుగుల రూప లావణ్యంలో
మధురమైన జీవామృతానందనోద్యాన వనంలో
ఆడుకుంటున్న చూడ చక్కని నీ శిశువునేనమ్మా...!
అవధులు లేని అనుభూతులాలింగనంలో
తళుకు నునుపు లీనుతూ నీ నీటి నీలాలలో శయనించి
నీ పారవశ్యపు పర్ణశాలనుంచి జనించిన పసికందునే...!
ఏనాటికైనా ఉగ్గపట్టి ఏడ్చే నీ కడుపు తీపిని..
నీ గర్భగుడి నా చిరునామ అమితాశ్చర్యంగా...
నన్ను సృష్టించి... పెద్ద చేసి...ఈ రోజున... నీవిపుడు
నా ముద్దు మురిపాల పసిపాప వయ్యావు...
గోరుముద్దల జాబిల్లివే నా చిట్టి తల్లీ !
చిన్ని తండ్రినై లాలించి.. తినిపించి..
ఎత్తుకుంటాను.. నా కంటి నీలాలెపుడూ నీవే!
కళ్ళలో కనిపెడుతూ కాపాడుకుంటానమ్మా!

–నిర్మల దేవి .ఎన్

## తొలి గురువు

ఒకరోజు స్మరించు
కొనేదికాదు అమ్మతనం!
జీవనదిలా నిరంతరం
సాగే ప్రేమప్రవాహం
ప్రేమ ఆరంభమయ్యేది
తల్లితోనే అంతమయ్యేది
తల్లితోనే.
ఈ సృష్టిలో
ఉదాత్తమైనది
తల్లి మనసుమాత్రమే
తల్లి పిల్లలచేయి పట్టుకొని
నడిపించేది కొంతకాలమే
ఆమె హృదయం
మాత్రం కొట్టుకొనేది
తన ఆఖరి శ్వాసవరకు.
అమ్మతనం అతిమధురం
వర్ణించడం ఏ భాషతరంకాదు
అమ్మస్థానాన్ని భర్తీచేయటం
ఎవరితరం కాదు
దేవుడికి మారురూపు అమ్మ.
ప్రపంచం దృష్టిలో
తాను అమ్మ
ఆమెకు మాత్రం
పిల్లలే ప్రపంచం
తల్లిప్రేమ ఏఅడ్డంకిని
అంగీకరించదు
ఎలాంటి సవాళ్ళనైన
ఎదురొడ్డుతుంది
ఏ త్యాగానికైన
సిద్ధపడుతుంది.
తల్లిలేని ఇల్లు
దేవతలేని గుడివంటిది
కొవ్వొత్తిలా తాను నిత్యం
కాలుతూ పిల్లల
ఉజ్వల భవితకు
నిర్విరామ కృషి చేస్తుంది.
నువ్వుఎంత ద్వేషించిన
నిను ప్రేమించే
వారున్నరంటే అది
అమ్మమాత్రమే
అమ్మ తరాల వారసత్వాన్ని
పిల్లలకు అందించే
అనుసంధానకర్త.
అమ్మ గోరుముద్దలతో
పెద్దచేసి ఓనమాలు దిద్దించి
తన శాయశక్తులా
తీర్చిదిద్దుతూ
పిల్లల శక్తియుక్తులను
కనిపెట్టి సరిదిద్దే
తొలి గురువు.
అహరహం తన పిల్లల
ఉన్నతికి తన ఆరోగ్యాన్ని
సైతం పణంగా
పెట్టే త్యాగమయి
ఈ అమ్మతనం చక్రం
సజావుగా తిరిగినంత కాలం
జగతికి ఆనందం
అది ఆగిందా అంతం.

–సంధ్య సుత్రావె

## పంచిన రక్తం

ఆ మేఘం గుండె అంచున
బాధను దిగమింగి
కంటి కొనల నుంచి కన్నీటి వర్షం కురిసినా?
పంటను చూసి పడిన వేదనను విస్మరించి
పుచ్చపువ్వులా నవ్వుతుంది.
ఆ తరువు ఫలాలను ఆభరణంగా ధరించి
తన శాఖలతో శోకాలను తుడిచేసి
త్యాగానికి చిరునామాగా మారుతుంది.
ఆ నది నాలుగు రెప్పల పాయలలో
ప్రవహిస్తూ తగిలిన ముళ్ళను,
రక్కిన రాళ్లను ఒరుసుకుంటూ
చిరునవ్వు పరవళ్ళతో
కుటుంబమనే సముద్రంలో కలిసిపోతుంది.
రెక్కలు విరిగినా
పిల్ల పక్షులకు రెక్కలు వచ్చేదాక
తల్లిపక్షి గూడును అల్లుకొని వుంటుంది.
తల ఎక్కడో ఆకసంలో ఎగరేసినా
భూమి మీద తల్లివేరే ఆధారం మనకు.
అమ్మ గర్భాన నిను మోసినందుకు
గుండెల్లో జీవితాంతం ఆమెను మోయాలి.
అమ్మ కాళ్ళ దగ్గర స్వర్గం ఏమో గానీ
అమ్మ సామీప్యం స్వర్గమే.
ఏమైనా వేరు చేయగలం గానీ
ఆమె పంచిన రక్తాన్ని వేరు చేయగలమా?


–ఎన్. లహరి

## అమ్మ రుణం

అమ్మంటే నీకెందుకు ఇంత ఇష్టం అంటే
ఏం చెప్పను?
అమ్మ నాతో కలిసి ఆడేది, పాడేది.
ఎన్నో కష్టాలకోర్చి నన్ను చదివించింది
ఎంత ప్రేమగా చూసేదో ..
చదవక పోతే
అంత కఠినంగా వ్యవహరించేది
ఎన్ని బాధలు, ఎన్నెన్ని బాధ్యతలు.
అన్ని ఒక్క చిరునవ్వుతో ఎదుర్కొనేది..
పెళ్లి పేరుతో అమ్మను వదలి వచ్చినా
ప్రతి క్షణం, ప్రతిపనిలో
అమ్మ గుర్తొస్తుంది.
అమ్మ దగ్గరకు వెళ్ళాలనే తలపు రాగానే
ఏదో కొత్త ఉత్సాహం ఉరకలు వేస్తుంది.
ఊరిలోకి అడుగు పెట్టగానే
"అమ్మ చేయి గాలై
నన్ను నిమిరినట్లు ఉంటుంది"
"ఇంట్లో అమ్మ ఉంటే అన్నీ ఉన్నట్లే".
అందుకే అమ్మా!
హద్దులు దాటే ఆనందం కలిగినా
నీతో పంచుకోవాలని,
నీ సాంత్వన కోసం పరుగులు పెడతాను
భరించలేని బాధ కలిగినా,
విశ్వమంత విషాదం కమ్మినా
నాకు నీవున్నావనే నిశ్చింత పొందుతాను..
ఎంతటి విషాదం ఐనా..
బాధనైనా నీ స్పర్శతోనే
మర్చిపోవాలనుకుంటాను..
ఎందుకంటే ఈ దేహమూ..
ఇందులోని ప్రాణమూ నీ భిక్షే అమ్మా!
ఏమిచ్చినా నీ రుణం తీర్చుకోలేను అమ్మా!
'ఏ'మరుజన్మకు నీకు అమ్మనయితే తప్ప."

–వేముల ప్రేమలత

## నిలువెత్తు జాతీయ జెండా అమ్మ....



అమ్మ ఒక శిల్పం
ఉలిచేత పట్టి తనను తాను
ఎన్నో రూపాలు చెక్కుకుంటుందేమో!
ప్రతిరూపంలోనూ ప్రేమ త్యాగం ధైర్యం నింపుకొని
నిలువెత్తు జాతీయ జెండాలా నిలబడుతుంది.
పచ్చని బంగారం రంగు అమ్మ
కట్టెల పొయ్యి దగ్గర మా కోసం వండి..... వండి
పంట చేలల్లో పనిచేసి.... చేసి
ఒళ్లంతా నల్ల బంగారమయ్యింది.
ఎండలో వరి పొలంలో కలుపు తీయడానికి
అమ్మ హరివిల్లులా వంగినప్పుడు
ముక్కుకున్న బేసర మాగాణి నీళ్లల్లో
వెండి నెలవంకలా తళుక్కుమని మెరుస్తది.
ఇంకా కాళ్లు, చేతులైతే
ఎర్రగా రక్తమోడుస్తూ పురిటి బిడ్డలా కనపడతయి.
అమ్మ ముఖానికి చెమటలు కూడా అందమే
పల్లెటూరి శ్రమజీవైక సౌందర్యమే!
నడుముకి చీర కొంగు బిగించి
రోట్లో కారం దంచుతున్నప్పుడు
యుద్ధానికి బయలుదేరిన వీర వనితల అగుపడుతది.
ఇసుర్రాయిలో పెసలు, మినుములు, కందులు
బియ్యం గిరిగిరా తిప్పుతుంటే ఆ గాజులు చప్పుడు
ఎద్దుల మెడలో గంటల వినబడతయి.
పూరిపాక సంసారమైనా
ఎర్రమట్టితో ఇల్లు అలికి
నాము ఉండతో చుక్కల ముగ్గులేసి
ఆకాశంలో నక్షత్రాలు నేలపైకి దింపేది మా అమ్మ.
అప్పుడప్పుడు ఆకలికి కన్నీళ్లను తాగినా
చిల్లు పడ్డ తాటాకు ఇంట్లో వానకు తడిసినా
చిరిగిన చీరను కట్టుకున్నా
సీతమ్మోరి కష్టాలు చవిచూసినా
అమ్మ ముఖంలో నవ్వెప్పుడూ చెదరలేదు
నాన్న పైన చిరాకెప్పుడూ చూపలేదు
మా అమ్మ 'యడవల్లి సీతారాములమ్మ'...!


–యడవల్లి శైలజ

## అమ్మంటే

జగతికి ఊపిరులూదే..అమ్మజని !!
జనవిత్తనములకు సుక్షేత్రం !!
అంకురానికి ఆకారం ఏర్పరిచే
అవని నలువ !!
రుధిరముతో గర్భస్త శిశుఉదరము నింపే అవధూత!!
తనజన్మ లక్ష్యం తల్లిగా పదవిపొందటం..!!
తన కర్మ ఫలితం తనపసిబిడ్డ
బోసి నగవు !!
తన ఘర్మ జలమే..పసిమొలక ఎదుగుదలకు చినుకు !!
తన మర్మం ఎరుగుట .
బ్రహ్మకైనా... అసాధ్యం..!!.
కడుపున నలుసు పడినంతనే
దైవమా..నవమాసాలూ..కాపాడు..అని ప్రార్థిస్తూ !!
కడుపులోన శిశువు కాలి తన్నులకు అపురూపమని
అనందించీ!!
తన ప్రాణం పోతున్నా నాబిడ్డను క్షేమంగ బైటపడనీ
అని వేడుకుంటూ!!
ఆపై ఏ చెడుదృష్టీ పడనీక పదిలంగ కాపాడుతు పెంచీ!!.
ఎదిగేబిడ్డ కడుపు నింపేందుకు ఏడేడు కాలాలు
శ్రమకోర్చుతూ..!!
తండ్రి చుట్టపు చూపైనా తల్లి చూపే చుట్టిన కవచం బిడ్డకు!!
చదువులు పెంచి పదవుల చేర్చి...
తరించి పోతున్నానని సంతసిస్తూ!
నీకేం తెలీదు నువ్వూరుకో అనీ కసిరితే..తొలిసారి క్షమించీ!
తన ఉనికిని మరచి ఉరిమితే
మరల మరల మన్నించి !
చివరకు దేహముడిగిన సమయాన ఈడ్చి బైట పడేస్తే !
బిడ్డ అజ్ఞాని దేవా శిక్షించకూ
ఇది నా రాత అని వేడుతూ!
తిండి పెట్టకున్నా తలకొరివి పెడితే చాలని తలపోసూ!.
తరతరాలుగా నరనరాలలో
తల్లిప్రేమను ప్రవహింప చేసుకుని బ్రతికే..తరుణి తల్లి.
అమ్మంటే...అమ్మే....!

–డా.కోడూరు సుమనశ్రీ

## "అమ్మ.. నా లైఫ్ గురు..!"



లోకం వద్దన్న తన గర్భకుహరంలో
నేను పెనుగులాడుతున్నప్పుడు
పసరుమందును జయించిన నా పుట్టువడిని
నిర్ణయించిన సృష్టికర్త మా అమ్మ.
తండ్రెవరో తెలీని జోగినోల్లపిల్లని
లోకులు ఆడిపోసుకుంటున్నపుడు
నా బుడిబుడి అడుగులను బడివైపు మళ్లించి
హాజరు పుస్తకంల తన పేరు పక్కన
సగర్వంగా నా పేరు ఎక్కించి
అ– అమ్మ అన్న వర్ణమాలను
బతుకు పలకలో దిద్దించిన ఆదిగురువు మా అమ్మ.
జోలపాట పాడకున్నా చందమామను చూపెట్టకున్నా
నేనున్నానంటూ ఆనెలు గట్టిన మెరటు చేతుల్తో
తలనిమిరిన ఆత్మవిశ్వాసపు దీవనైంది మా అమ్మ.
కుండల్లో ధాన్యం నిండుకున్నా గురుగుల్లో
కాసులగలగల్లేకున్నా
రాట్నం కండె లెక్క కరిగిపోతూ
చేదుకున్న బాయికాడి కైకిల్లతో
కూరాడికుండలో తేరుకున్న తేటఅంబలోలె
బతుకు దూప తీర్చిన జీవన చలివేంద్రం మా అమ్మ.
గాంధీ బొమ్మ దుకాణంల –చేపయిలు గుబులురేపుతున్నా
కట్టాల్సిన ఫీజుల ఆఖరితేదీలు హెచ్చరిస్తున్నా
తన మదిపొరల కదలికలు తెలియనీయని ఒంటి నిట్టాడి
గుంజ మా అమ్మ.
గుడిశెల కంతలు వెక్కిరిస్తున్నా
షానీపోరీల స్టేట్రీలు కొనీయకున్నా
తన కోటిమాసికల చీర బొత్తులో
నా సిగ్గుల తొలినెలసరిని దాచేసిన జిగ్రీ దోస్తుమా అమ్మ.
నే కోరిన కలలను సాకారపర్చిన
విజయపు కొవ్వొత్తి మా అమ్మ
భుజాల పై మోశిన బిడ్డ గెలుపుకు
సంబురపడుతూ..దిగిపోని సూరీడసొంటి
మా అమ్మ ఋణం ఏమిచ్చినా తీర్చుకోలేనిది.
కన్కీరమ్మ బిడ్డ పెద్ద ఆఫీసరైందని
ఇప్పుడు అందరూ అనుకుంటుంటే పాడుజిష్టి తగలకుండా
కాలిగ్గట్టిన నల్లగొంగడి దారమై మురిశేటి
అతి (అ) సాధారణ మనిషి గాక
మరేమీ గాని అమృత మూర్తి మా అమ్మ.!
××
'చేపయిలు=చేబదులు
'కన్కీరమ్మ=కనక ఈరమ్మ

–బి. కళాగోపాల్



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### వ్యక్తిత్వపు వెలుగులు

జీవితం అంటేనే నిత్య సంఘర్షణ
అనుక్షణం అప్రమత్తమే.
ఏ వైపు నుంచి ఏ ఆపద పడగ నిప్పుతోందో
ఎవరికి తెలియదు.
కాలం పెట్టే పరీక్షలు దాటుకుంటూ
ఎప్పుడు పోరాటమే.
కష్టసుఖాల సుడిగుండాల్లో మునకలే
చుట్టూ ఎంతమంది ఉన్న నీ జీవితం నీదే.
కాలం కొలిమిలో కాల్చబడుతూ
నీకు నీవే మలుచుకోవాలి ఉన్నతంగా.
చుట్టూ ఎడారి ఉందని అదిరిపడకు
పక్కనే ఉంటుంది ఒయాసిస్సు.
సమస్యలనేవి అడ్డంకుల్లాంటివి
వచ్చిపోతుంటాయి పట్టించుకోకు.
ఎత్తయిన శిఖరం పక్కనే
కళ్ళు చెదిరి లోయ దాగి ఉంటుంది.
దేనిలోని అందం దానిలో దాగి ఉంటుంది
అంతా ప్రత్యేకంగా అమర్చుకుంటాయి
ప్రకృతిలో రెండు సమబాగాలే.
గంభీర వదనంతో కనిపించే సముద్రునికి
తప్పలేదు ఆటుపోటులు కడుపులో అగ్నిపర్వతాలు.
ఉదయపు వెలుగు నుండి పడమటి సంధ్య వరకు
మధ్య ఉన్నదె సంధి కాలము
రెండింటిని కలిపి కట్టే తోరణమే జీవితం.
దానిపై వాలె అందమైన ఆకారాలే సమస్యలు సంతోషాలు
వాటిని దాటుకొని వెళ్లి పడమటికాంత ఒళ్ళొ సేదతీరడమే
విశ్రాంతి.

–మాదాసు లక్ష్మి నారాయణ
+91 99497 07512

### నాట్యం – భావాల తాండవం

అడుగుల సవ్వడిలో లయ...
హస్త ముద్రలలో దాగున్న అక్షరం...
కనుల చిలిపి కదలికలో కవిత్వం!
అలంకారాల ఆభరణంలో
అంగసౌష్ఠవం మెరుస్తుంటే...
ముఖంలో విరిసే నవరసాల సంగమం,
శరీర విన్యాసంలో సాక్షాత్కరించే నాట్య వేదం!
మనసుకు మధురానుభూతి పంచే ఈ నాట్యం!.
ఇది కేవలం వినోదం కాదు.. ఓ తపస్సు!
ప్రతి కదలిక ఒక దివ్య అర్పణ,
ప్రతి లయ ఒక మూగ ప్రార్థన!
హస్తముద్రల హారతిలో,
భావాల జ్యోతులు వెలుగుతుంటే...
ఆ దేవాలయ శిల్పమే ప్రాణం పోసుకుని,
భువిపై కదిలిందా అనిపించే అద్భుత క్షణం!.
గజ్జెల రవళిలో ఓంకార నాదం...
నవరసాల సంగమంలో దివ్య తపస్సు!
ఆలయ ప్రాంగణాల నుంచి,
భూమికి దిగివచ్చిన పుణ్య నాట్యం!
భక్తికి బాట.. భావానికి తోట...
మన నాట్య సంస్కృతికిది నీరాజనం!
అభినయమే ఆరాధనగా సాగే ఈ వేళ...
పరవశించి పులకించదా సమస్త జగతి ఈ వేళ!
మాటలు మౌనమైతే...
శరీరమే నాట్యమై, భావమే నాదమై,
హస్త ముద్రలు మాట్లాడే దివ్య భాష... నాట్యం!
మనసులోని భావాలు ఆ భగవంతుడి దాకా,
పూలదారిగా చేరే మోక్ష సాధనం... నాట్యం!
నటరాజ తాండవంలో విశ్వ రహస్యాన్ని,
శ్రీకృష్ణుడి రాసలీలలో ప్రేమానందాన్ని కురిపిస్తూ...
ఆ పరమాత్మునిలో లీనమయ్యే మార్గం చూపింది!.
తాళం పలికే ప్రతి అడుగు,
లయలో లీనమై తనువంతా కదులుతుంటే...
కళ్ళ చిలిపి కదలికల్లోనే, ఎన్నో కథలు కళ్ళకు కడుతుంటే...
చూసేవారికి అది పరమానందం,
చేసే కళాకారుడికి బ్రహ్మానందం!
హృదయ తంతులను మీటే,
ఆ అభినయమే కదా అసలైన నాట్యం!.
నాట్యం– లయల లీల,
నాట్యం – భావాల వర్షం,
నాట్యం– కథల ప్రవాహం!
ఈ మూడు ముత్యాలూ కలిసినప్పుడే...
ఒక చూపే పద్యమై,ఒక చిరునవ్వే కథగా మారి...
భువిపై కదిలే ప్రతి అడుగు,
ఓ మహా కళా సముద్రమై ఉప్పొంగుతుంది!

–డాక్టర్ కే శ్రీనివాసరావు, +91 94901 90411

### జ్ఞాపకాల దొంతర

నా జ్ఞాపకాల పుటల్లోకి ఒక్కసారి తొంగి చూసా ఎన్నెన్నో రంగుల చిత్రాల్లో ఆహ్లాద విషాదవర్ణాలతో ....
కొన్ని జ్ఞాపకాలు తీపి గుర్తులు పెదాలపై చిరునవ్వులు పూయిస్తే,, మరికొన్నీ కన్నీటిని మిగిలిస్తున్నాయి,, కాలానికి రివైండ్ ఉండదని తెలిసి ఆ జ్ఞాపకాల దొంతరలే మనసును ఉరడిస్తున్నాయి,, గతం ఒక నిధి.. జ్ఞాపకం ఒక వంతెన.. మనిషిని మనసుతో కలిపే అనుబంధాల సంకెల ....
జ్ఞాపకం అలుపెరుగని మౌనరాగ ప్రయాణం, ఎన్నటికీ చెరిగిపోని మన జీవిత చిత్రపటంను నెమరు వేసుకోవడం వల్ల మానసిక తృప్తిని పొందేము ....
జ్ఞాపకాలే మన అస్తిత్వానికి ఆనవాళ్లు ....
మధురాలు,,, జీవితంలో ఎన్ని మలుపులు తిరిగినా, తీపి ,చేదు అనుభవాలు ..బొమ్మ బొరుసుల్లా, తట్టి లేపును ,,నిశ్శబ్దపు రాత్రి వేళ నిధుర రాక చూస్తుంటే... సుళ్ళు తిరిగే జ్ఞాపకాల దొంతర ,మంచి చెడులా కలబోత... గుండె లోతుల్లో కదలాడే అలజడుల చిత్రమాలిక.... బాల్యంలోని నేస్తాలు వారితో ఆడిన ఆటలు హృదయ ఫలకంపై ముద్రితాలు ...
అమ్మ ఆప్యాయత, నాన్న క్రమశిక్షణ, తోబుట్టువుల గిల్లికజ్జాలు ,చిన్ని చిన్ని తగాదాలు.. మరపురానివి....
కొన్ని నవ్వులు పువ్వులు పూయించి హృదయానందం కలిగించే మనోహర విరజాజులు.... చదివిన పెద్ద చదువులు ,ప్రథమంగా పొందిన ర్యాంకులు, ప్రభుత్వ కొలువు దొరుకుట, ఆనందాన్ని కలిగించే రంగురంగుల చిత్రాలు,,
నాటి పండుగలు ఎంత హాయిని కలిగించేవి తలచుకుంటే తన్మయం కలుగుచుండే ....
సర్వీస్ నేచ్చలి వీడిపోయి ,ఒంటరిని చేసిన వైనం,,
విషాదంగా తోచే...
విద్యార్థులతో మమేకమైన సందర్భాలు గుర్తొచ్చి
కళ్ళు చెమ్మ గిల్లే .....
కవి సమ్మేళనాలు, రచన వ్యాసంగం, ఓదార్పునిచ్చే ....
బాధను కలిగించే జ్ఞాపకాలను మరువడానికి ప్రయత్నిస్తే సాధ్యం కాకపాయే..... మాతృత్వపు మధురిమలు తేనె వలె తోచే ....
విదేశాల్లో ఉన్న పిల్లలు తలుపుకొస్తే బాధ కృంగదీసే....
జీవితమే మంచి చెడు అనుభవాల కలబోత...
ఎంత నెమరువేసిన తరగతి సంఘటనల సమాహారం ....
మంచిని తలుస్తూ.. చెడును విడుస్తూ..
శేష జీవితం ప్రశాంతంగా గడపవలె,,
జ్ఞాపకాల దొంతరలో తేలి యాడ వలె...
జీవితమంటేనే సుఖదుఃఖాల సంఘమము...
ఏది జరిగినా మన మంచికేలే అనే
సానుకూల దృక్పథంతో చివరి అంకాన్ని ముగించవలె

–కాసర్ల సరోజాదేవి
+91 73311 29477

# పారుపల్లి రంగనాథ్‌కు బిరుదు ప్రదానం

హైదరాబాద్, మే 6: నవ్యనాటక సమితి, అన్నమాచార్య మిషన్ ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 618వ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో టీటీడీ ఆస్థాన గాయకులు పారుపల్లి రంగనాథ్‌కు అన్నమయ్య సంకీర్తన గాన నిపుణ బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కే.వీ. రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని రంగనాథ్‌ను ఘనంగా సన్మానించి బిరుదు ప్రదానం చేశారు. రమణాచారి మాట్లాడుతూ పారుపల్లి రంగనాథ్ అద్భుత గాయకుడున్నారు. ఆయనను సన్మానించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, ప్రభుత్వ అధికారి వసుంధర, నాట్యగురువు నిష్ఠల సుధామాల, కామిశెట్టి గోదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రంగనాథ్‌కు పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

## తోడుగా నడిచే నీడలు

నడచి నంత మేర వెన్నుదన్నుగా
కలసిన హృదయాల కెంత ఆనందం
మనసులు రెండు తోడైతే
ఎంత సంబరం
మనిషికి మనిషి తోడూ నీడైతే ఎంత పరవశం
నిరంతర అన్వేషణ ఆత్మీయ స్పర్శకై తపన
స్నేహం..స్నేహబంధం...
ప్రతి గుండెను కదిలించే ఆక్సిజన్
హృదయానికి భరోసా నిచ్చే అక్షయం
ఆయుస్సుల పెంచే దివ్యామృతం
జననం నుండి మరణం దాకా
ఎన్నెన్ని ప్రణాల బాదలబర్వుల గుండెకోతల వడగాడ్పులలోనూ
సేదదీర్చే చల్లని సమీరమిదే
రెండు గుండెల నిక్షిప్తం చేసి దాచే నేల మెల్లిగా
ఎవరికి ఎప్పుడూ చెప్పుకోలేని హృదయాల సవ్వడులు
ఆవిష్కరించింది ఇక్కడే
హృదయాలు లేకుండా ఏ ఉదయం ప్రభ వించదు
తోడు లేకుండా ఏ ఉదయానికి విలువుండదు
చిన్న పలకరింపు సన్నని నవ్వు ఎన్నెన్ని తుషార బిందువులు
వెల లేనిది కొనలేనిది ఏ బేధాలు లేనిది కదా
గాలి వీచనిదే చెట్టు ఆకులు కదలవు
ఆకులు కదలకుంటే గాలే లేదు.
మరి నేటి గ్లోబల్ హైటెక్కుల్లో చిక్కి
నేడు స్నేహాలు అదృశ్యమౌతున్నాయి
వెన్నంటి నిలిచే నీడలను చెరుపుకుని ఈ తరం
తోడు కోల్పోయిన క్రౌంచ పక్షుల్లా
మాయా ప్రపంచంలో
భ్రమల్లో.....



–చకోనా
9885797375

# 'డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ జీవితచరిత్ర' ప్రొ॥కొలకలూరి మధుజ్యోతి ప్రశంస

పుస్తక సమీక్ష

జయసూర్య రచించిన జీవిత చరిత్ర **'మార్టన్‌లూథర్ కింగ్'.** ఇది యాభై విభాగాలుగా ఉన్న జీవిత చరిత్ర. జయసూర్య సమగ్రంగా సంపూర్ణంగా దీనిని తీర్చిదిద్దారు.


వర్ణవివక్ష వ్యతిరేకి, అహింసా మార్గ అనుయాయి మార్టిన్ లూథర్‌కింగ్. 1930లో జన్మించి నీగ్రోల హక్కుల కోసం, సమానత్వం కోసం, శాంతియుతంగా పోరాడి 1968లో అంటే 39 ఏళ్ళకే జాతి వివక్షకు బలయ్యాడు.

అతిపిన్న వయసులో నోబుల్ శాంతి (1964) బహుమతిని పొందిన చారిత్రకత మార్టిన్ లూథర్ కింగ్‌ది.

క్రైస్తవ మత బోధకుడిగా ఎదిగిన మార్టిన్ లూతర్ కింగ్, క్రైస్తవంలోని శాంతి కాముకతను ప్రేమించాడు, బోధించాడు.

భారత దేశంలోని మహాత్మా గాంధి ప్రతిపాదించి అనుసరించిన అహింస సూత్రాన్ని దాని ఫలి తాలను గుర్తించాడు స్వీకరించాడు. ఈ రెంటిని తన పోరాట స్ఫూర్తిలో భాగం చేసుకొన్న వైనాన్ని జయసూర్య అందరూ గుర్తించేలా ఆవిష్కరించారు.

ఉద్యమంగా సాగుతున్న తన పోరాట క్రమంలో వైవాహిక కౌటుంబిక జీవితంలో తన వారికి దూరంగా ఉండవలసి వచ్చినప్పుడూ, ప్రాణాప్రాయ స్థితిలోనూ, జీవిత భాగస్వామి కొరెట్టాస్కాట్ చూపిన ఓర్పు ధైర్యం ప్రోత్సాహం సంయమనం మార్టిన్ లూథర్ కింగ్‌లో ఉత్సాహం నింపాయి. ఆమె, కింగ్ అనేక ప్రదేశాలు, ఊర్లు పర్యటించడానికి పూనికను, జైలు జీవితంలో స్ఫూర్తిని కలిగించటాన్ని జయసూర్య పేర్కొన్నారు. కింగ్ ఒక్కడై ఆరంభించిన చైతన్యం,




ప్రతులకు:నీల్‌కమల్ పబ్లికేషన్స్
సుల్తాన్ బజార్ కోటి,
హైదరాబాద్–
సెల్: 8019918182



శ్వేతజాతీయుల వర్ణవివక్ష వ్యతిరేక పోరాటమై, సామూహిక ఉద్యమమై నిలిచింది. శ్వేత జాతీయులతో సహా నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కలర్ పీపుల్ (NAAC) గా ఏర్పడటం, దానికి అన్ని రకాల ఉన్నతోద్యోగాలలో ఉన్నవారు తోడవ్వటం, యువత జతకూడటం, ప్రభుత్వ వ్యతిరేకులై జైలు నిండటం, విద్యార్థులెందరో ఈ ఉద్యమానికి బలికావటం వంటి ఎన్నో చారిత్రక వాస్తవాలను కింగ్ జీవిత చరిత్రలో రచయిత ప్రకటించారు.

ఈ క్రమంలో అబ్రహం లింకన్ బానిస విముక్తి కోసం పడిన ఆరాటం (1863), ఎందరెందరో కాలక్రమంలో ఆ పోరాటాలలో భాగం కావటాన్ని పేర్కొన్నారు. సమాజంలో వ్యక్తుల మధ్య, ఉద్యోగ రంగాలలో, ఓటు చేసే అవకాశంలో, అన్ని చోట్లా వర్ణవివక్ష ఉండటం బహిరంగ రహస్యం. లింకన్ Emancipation proclamation 1963 లో కెన్నడి అధ్యక్షుడిగా ఉన్న కాలంలో The Equal Pay Act; 1964 The land mark Civil Rights Act గాను రూపు దాల్చింది. 1965లో నల్లజాతి వారికి ఓటు హక్కు లభించింది. వివక్షాతీత చట్టాలు, నల్ల జాతీయులకు రాజ్యాంగ రక్షణను ఏర్పర్చటం చాలా వివరంగా జయసూర్య అందించారు. నల్లవారి కోరికలకు సానుకూలంగా ఉన్న జాన్. ఎఫ్. కెన్నడి హత్య ఓ దురదృష్టకర ఘటన. కెనడి మరణించిన 8 నెలల తర్వాత పౌరహక్కుల చట్టం ఏర్పడి నల్లవారికి స్వేచ్ఛా సమానత్వ సామాజిక న్యాయాలకు భరోసా ఇచ్చింది. చరిత్ర పొడుగునా జరిగిన అమానుష చర్యలను, ఎంతో లోతుగా అధ్యయనం చేసి చాలా సంక్షిప్తంగా సంయమనంతో జయసూర్య అందించారు. బర్మింగ్‌హమ్ ఉద్యమం, వాషింగ్ టన్ మార్చ్, పోలీసుల కిరాతక చర్యలు, బాంబింగ్‌లో బాలికల బలిదానం కూడా ఈ చట్టం రావటానికి కారణం అయ్యాయి. చట్టం ఏర్పడినా ఇవన్నీ అమలు కావటానికి కూడా నల్లవారికి పోరాటమే.

వియత్నాంపై అమెరికా (1967) యుద్ధాన్ని, శాంతి కాముకుడైన కింగ్ వ్యతిరేకించాడు. హింసను వ్యతిరేకిస్తూ పౌర హక్కుల నేత హత్యకు నిరసనగా కింగ్ చేపట్టిన ర్యాలీ freedom day గా చరిత్రలో 1966లో నిలిచింది. ద్వేషంతో నిండిన ముఖకవళికలు, తిరస్కృతి, శాపగ్రస్తమైన ప్రవర్తనలు, అవమానించే అసహ్యించుకునే చూపులు, ఉమ్మివేసే చేష్టలు విపరీత వేదన కలిగించాయి. బ్లాక్‌ల పట్ల చిన్న చూపును భరించలేకపోయాడు. నల్లజాతి వారిని వివక్ష నుంచి విముక్తి చేయాలని కాంక్షించే కింగ్ నోబుల్ బహుమతిలో భాగంగా ఇచ్చిన 54,600 డాలర్ల నగదును కూడా కింగ్ పౌరహక్కుల ఉద్యమాలకే ఉపయోగించాడు.

I have a dream అనేది వారి ప్రసిద్ధ ఉపన్యాసం. శరీర రంగును బట్టి కాక, వారి శీల స్థాయిర్యాలను బట్టి న్యాయం చేకురాలని మార్టిన్ లూథర్ కింగ్ కల కోరిక.

నేటికి వర్ణవివక్షకు గురవుతున్న మరణిస్తున్న సంఘటనలు, ఆ కల ఇంకా నెరవేరలేదనే చెప్తున్నాయి.

అవి పారిశుద్ధ కార్మికుల నిరసనోద్యమం సాగుతున్న రోజులు. 1968 ఏప్రిల్ 4న మెంఫిస్ లోని మోటల్ మొదటి అంతస్తులోని తన గది నుంచి బయటకు వచ్చిన కింగ్‌ను, ఎదుటి భవనపు రెండో అంతస్తు నుంచి జేమ్స్ ఇరల్ రే తుపాకితో కాల్చాడు. రే దొరికాడు హంతకుడు ఎవరూ అనేది వివాదాస్పదం అయింది. కాని రే శిక్ష అనుభవిస్తూ జైలులో మరణించాడు.

శ్రీమతి కొరెట్టి స్కాట్ తన భర్త కింగ్ స్మృతి చిహ్నంగా సెంటర్ ఫర్ నాన్ వయోలెంట్ సోషల్ ఛేంజ్ నెలకొల్పి కింగ్ ఉద్యమ స్ఫూర్తిని వారి మరణానంతరం కొనసాగించారు.


ఇలా ఎంతో లోతుగా వివరంగా చారిత్రక వాస్తవాలను సేకరించి విలువైన గ్రంథంగా దీనిని అందించారు పరిశోధకులైన జయసూర్యగారు. 'మార్టిన్ లూథర్ కింగ్' ఉద్యమ స్ఫూర్తి స్మరణీయం. జయసూర్య గారికి నా మనఃపూర్వక అభినందనలు.



–ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

## పరిప్రశ్న

ప్రాణం నీ పరిమాణం
జవాబు మౌనం
ఆత్మ నీ ఆకారం
సమాధానం నిశ్శబ్దం
పంచ భూతాల కూటం
ప్రభవించే ఒక రూపం
అవి శాస్త్రాల నిర్వచనం
చలనం ఆగితే మరణం
అని వైద్య శాస్త్ర నామకరణం
పుట్టడం ఎందుకు?
చావడం దేనికి?
పూర్వ జన్మ కర్మఫలం
ప్రస్తుత జీవన పథం
అవి వేదాంత ఉవాచ
దీనికి ప్రత్యక్ష సాక్షులెందరు?
విని నెమరు వేసేవారెందరో
నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి
సైతం
ఈ ప్రశ్న ప్రశ్నగానే పయనిస్తోంది
జాతస్య హిధ్రువో..



–సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ
సెల్:9346671524

## పథకం పారింది.. అప్పు తీరింది! (కథ)

ఒక ఊరిలో వరహాలశెట్టి అనే వ్యాపారి ఉండేవాడు. ఆయన చాలా దయాగుణం కలవాడు. ఇంట్లో ఎలుకల బాధ పడలేక ఒక పిల్లిని, ఇంటి రక్షణ కోసం ఒక కుక్కను పెంచుకున్నాడు. వాటిని ఆయన ఎంతో ముద్దుగా, ప్రాణప్రదంగా చూసుకునేవాడు.

శెట్టిగారి ఇంటికి దగ్గరలోని ఒక కలుగులో ఒక చిట్టెలుక నివసించేది. అదే గ్రామానికి చెందిన సత్తిబాబు, తన భార్యకు ఒంట్లో బాగులేదని చెప్పి శెట్టిగారి దగ్గర కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు.


నెలలు గడిచినా సత్తిబాబు అప్పు తీర్చలేదు. పైగా శెట్టిగారికి కనిపించకుండా తప్పించుకు తిరగసాగాడు. దాంతో శెట్టిగారు మనస్తాపానికి గురయ్యారు.

యజమాని దిగులుగా ఉండటం చూసి పిల్లి, కుక్క బాధపడ్డాయి. సత్తిబాబుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నాయి. తమ మధ్య ఉన్న సహజ వైరాన్ని మరిచి, స్నేహంతో కలుగులో ఉన్న చిట్టెలుక సాయం కోరాయి.

చిట్టెలుక అందుకు అంగీకరిస్తూ.. "మనం ముగ్గురం కలిసి సత్తిబాబుకు బుద్ధి చెప్పి, అప్పు వసూలు అయ్యేలా చేద్దాం" అని ఒక చక్కని పథకం వేసింది.

ఆ రాత్రి కుక్క, పిల్లి కాపలా ఉండగా.. చిట్టెలుక తన సైన్యంతో కలిసి సత్తిబాబు ఇంట్లోకి చొరబడింది.

తెల్లారేసరికి సత్తిబాబు ఇంట్లో పరిస్థితి కకావికలమైంది. బస్తాల్లోని ధాన్యం అంతా నేలపాలైంది. వేరుశనగ కాయల తొక్కలు కుప్పలుగా పడి ఉన్నాయి.అది చూసిన సత్తిబాబు భార్య కోపంతో..



"ధర పెరుగుతుందని ఆశపడి సరుకు అమ్మకుండా దాచారు, ఇప్పుడు చూడండి ఎలుకలు సర్వనాశనం చేశాయి! ఇప్పుడైనా నా మాట విని, ఆ శెట్టిగారికే ఈ సరుకును అమ్మేయండి" అని గొడవ పడింది.

కంగారు పడిన సత్తిబాబు, మిగిలిన సరుకునైనా కాపాడుకోవాలని నేరుగా వరహాలశెట్టి దగ్గరికి వెళ్లి సరుకు అమ్మజూపాడు.

"కాగల కార్యం గంధర్వులే తీర్చారు" అని శెట్టిగారు లోలోపల నవ్వుకుంటూ, సరుకు పాడైనందున ధర తగ్గించి బేరం కుదుర్చుకున్నారు. లెక్క చూసి, పాత అప్పు పోగా మిగిలిన కొద్దిపాటి సొమ్మును సత్తిబాబు చేతిలో పెట్టారు శెట్టిగారు..

తమ యజమాని సమస్య పరిష్కారమైనందుకు పిల్లి, కుక్క ఎంతో సంతోషించాయి. అవి చిట్టెలుకకు కృతజ్ఞతలు తెలియజేశాయి. సమష్టి కృషితో అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపిస్తూ, అవి ఆనందంగా గడపసాగాయి.

–కాశీ విశ్వనాథం పట్రాయుడు
9494524445




## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



చదివింది
నాలుగో తరగతే అయినా...
పట్టుబట్టి ఆంగ్లం నేర్చుకుని
మరీ మాకు బోధించిన
నీ మేధావితనం అద్భుతం!.
చికిత్సకు లొంగని వ్యాధితో
బాధపడుతున్నా..
మోముపై చెక్కుచెదరని
నీ చిరునవ్వుల రూపం
మా మదిలో పదిలం ఎప్పటికీ!.
మంచం మీదే నీవున్నా..
వచ్చిన అతిథుల మర్యాదలకు
లోటు రానివ్వని నీ గృహిణీత్వం
మాకు ఆదర్శనీయం!.
అడిగినవారికి లేదనకుండా ఇచ్చే
నీ దానగుణత్వం..
ఆకలిగొన్న పేదవారికి వండి,
వడ్డించే నీ అన్నపూర్ణత్వం
మాకు అనుసరణీయం!.
కుట్లు,అల్లికలతో ఇంటిని
అలంకరించే నీ కళానిపుణత్వం..
చైతన్యానికి మారుపేరుగా
కూర్చున్న చోటునుంచే అన్ని పనులూ
పురమాయించే నీ నాయకత్వం
మాకు ఆశ్చర్యకరం!.
ఆరోగ్యం బాగున్న రోజుల్ల

### అమ్మకో లేఖ

ఆడబిడ్డలకు, మరుదులకు
సేవలు చేసి...
తన కన్నబిడ్డలకు
ఏమీ చేయలేకపోతున్నానని
బాధపడే
నీ అమ్మతత్వం
అమృతమయం!.
అందర్నీ నవ్వుతూ,
నవ్వించే నీ చతురత్వం..
ఏళ్లకేళ్ళు శారీరక బాధలు
భరించిన
నీ సహనతత్వం
స్ఫూర్తిదాయకం!
అమ్మా!
నిన్ను చూసి నేర్చుకోవాల్సిన
సుగుణాలెన్నో..
స్ఫూర్తిని పొందాల్సిన
అంశాలెన్నో!.
అవగతమయ్యేలోపు అనంత
లోకాలకు
పయనమైపోయిన అమ్మా!..
నీ అమృతత్వానికి
వందనం...అభివందనం!.

– చంద్రకళ.దీకొండ
మల్కాజిగిరి

### ఇలలో దేవత

అమ్మా వందనం.. అభివందనం
నవమాసాలు మోసి
నీ అనురాగమంతా కలబోసి
నాకు జన్మనిచ్చావు......
ఆప్యాయతతో అరమరికలు
లేకుండా అల్లుకుపోయేలా విద్యా
బుద్ధులు నేర్పించావు.
ఇంటికి ఇలవేల్పుగా నిలిచి
సంసార సాగరం ఈదుతూ
ఈ జగతిలో దేవతలకు
ప్రతిరూపంలా నిలిచావు
ఉత్తమ సంస్కారానికి
నీవే నిలువెత్తు రూపం అమ్మా
నేను ఎదగడానికి ఆధారమైనావు
ఏ సమస్యకైనా అలవోకగా
పరిష్కారం చూపించావు.
ఐకమత్యమే బలమని నేర్పావు
ఒడిదుడుకులను దాటే మార్గం
చూపావు
జీవననాయానాన్ని సక్రమంగా
సాగించేలా
జీవిత పాఠాలెన్నో నేర్పించావు
సహనముంటే
ఇలలో సాధించలేనిది
ఏది లేదని బోధించావు
అందరిలో మంచిని చూసే దృష్టిని
అలవరచావు
అందరికీ మంచి చేయాలని
నేర్పించావు
పదిమంది మంచి మనం కోరితే
మనకి పదిమంది
మంచి కోరతారని
సానుకూలంగా ఆలోచించటం
నేర్పించావు.
కాలం మారినా, మనసుల్లో
మమతానురాగాలు
మారరాదని
సదా స్నేహ భావంతో
మెలగాలని నేర్పించావు...
నేనీనాడు పదుగురి
హృదయాల్లో
స్థానం సంపాదించి
మంచి పేరు
తెచ్చుకోవడానికి మూలం
నువ్వేనమ్మా...
అమ్మా ఏమిచ్చి నీ ఋణం
తీర్చుకోగలను
నీవు నేర్పిన పాఠాలే నా
బిడ్డలకు నేర్పించి
నీ తత్వం వారసత్వం
నిలబెట్టడం తప్ప....
మళ్ళీ జన్మంటూ ఉంటే నీకే
బిడ్డగా పుట్టాలని
కోరుకుంటూ....
ఎప్పటికీ... నీ......
అమ్మలు లక్ష్మి
జగతిలోని అమ్మలందరికి
వందనం
నాకు ఈ అపురూపమైన
జన్మనిచ్చిన
మా అమ్మకు
శిరసాభివందనం !!

–లక్ష్మి పద్మజ దుగ్గరాజు
హైదరాబాద్

### మళ్ళీ జన్మంటూ ఉంటే!

అమ్మకుప్రేమతో,
అమ్మా..ఏ లోకములో ఉన్నావో!
నిన్ను గుర్తు చేసుకుంటే నా హృదయం కన్నీటితో నిండిపోతుంది
కళ్లలో నీడల్లా నీ జ్ఞాపకాలు తిరుగుతూనే ఉంటాయి.
చిన్నప్పుడు నీ కష్టం నాకు అర్థం కాలేదు.
నువ్వు మౌనంగా భరించిన బాధలు, కన్నీళ్లు,
అవమానాలుఇప్పుడే నాకు పూర్తిగా తెలుస్తున్నాయి.
అప్పట్లో నేను చిన్నవాడిని.. కానీ పెద్దయ్యాక కూడా
నీకు అండగా నిలవాల్సిన చోట నిలవలేకపోయాను.
నాన్న కోపం, పరిస్థితులు, నా అజ్ఞానం వీటన్నిటి మధ్యలో
నీపై నా ప్రేమను చూపించలేకపోయాను అమ్మా.
కొన్నిసార్లు నిన్నే మందలించాను కూడా
ఆ మాటలు ఇప్పుడు నా హృదయాన్ని గుచ్చుతున్నాయి.
నువ్వు మాత్రం ఎప్పుడూ అదే ప్రేమ.. అదే సహనం
మా కోసం నీ జీవితాన్ని పూర్తిగా అర్పించావు.
నువ్వు ఏమీ కోరకుండా, ఎలాంటి ఆశలు లేకుండా
మా కోసం కొవ్వొత్తిలా కరిగిపోయావు అమ్మా.
నిన్ను సంతోషపెట్టే అవకాశం నాకు పూర్తిగా రాలేదు
అది నా జీవితంలో పెద్ద లోటు.
ఇప్పుడు నేను రాస్తున్న కథలు.. చెబుతున్న మాటలు
అన్నీ నీ గురించే అమ్మా.!
నీలాంటి తల్లుల బాధలు ఇంకెవరికీ రావద్దని?
కొడుకులు తమ తల్లిని గౌరవించాలని చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను.
అమ్మా..
నువ్వు ఎక్కడ ఉన్నా.. నా మాటలు వినిపిస్తాయని నమ్ముతున్నాను.
మళ్ళీ జన్మ ఉంటే..
నీ ఋణం తీర్చుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.
క్షమాపణలతో
నీ కుమారుడు

–కానుకొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు

### అమ్మకు ఒక లేఖ

ప్రియమైన అమ్మకు,

నీ సుపుత్రుడు వ్రాయునది ఏమనగా. అమ్మా! బాగున్నావా? వేళకు తింటున్నావా? ఆరోగ్యం ఎలా ఉంది. నేను బాగానే ఉన్నాను. నా గురించి దిగులుపడకు. అలా దిగులుపడే పరిస్థితిని ఇక్కడి దాకా తీసుకొచ్చావు. దేవుడి దయ వలన నీకు సరైన చికిత్స అంది నీవు త్వరగా కోలుకున్నావు. అది చాలు. నీ అనారోగ్యం పదిహేనేళ్ళుగా నాతో పాటు పెరుగుతూ వస్తున్నా పైకి ఏమీ కానట్టు భలేగా నటించావు. ప్రతి రోజూ రాత్రి గాల్ బ్లాడర్ లో రాళ్ళు నొప్పి కలిగిస్తున్నా పురుటినొప్పులనుకొని ఆనందంగా భరించావు. నీ పిల్లలమైన మమ్మల్నే ప్రాణంగా భావించావు.

నీ మనసును మేము నొప్పించినా, మా మనసులను మెప్పిస్తూనే ఉన్నావు, మమ్మల్ని ప్రమాదాల నుండి తప్పిస్తూనే ఉన్నావు. కానీ ఏనాడూ తప్పు చేస్తే సరిచేయకుండా ఉండలేదు. నాకు చదువు నేర్పిన ఆదిగురువు నీవే. నాతో ఆడుకున్న బొమ్మల కొలువు నీవే. చాలా రోజులయిందమ్మ, నీ చేతి వంట తిని, నీ కంటిలో సంతోషాన్ని కని. నిన్ను సంతోషపెట్టాలంటే ఏం చేయాలో అర్థం కావడం లేదమ్మ. నీ సంతోషాన్నే తన సంతోషంగా నాన్న భావిస్తున్నాడు. ఎన్ని కష్టాలు ఉన్నా కూడా నా ఎదుగుదలే నీ ఆనందంగా భావిస్తావు. నా గాయానికి నీ కన్నీళ్ళను ఖర్చు చేస్తావు. నాకు దేవుడు ఎన్ని జన్మలు వ్రాసిపెట్టాడో తెలియదు కానీ నీవు, నాన్న తల్లిదండ్రులుగా లేని జన్మ నాకు వద్దు.

నీ ఆరోగ్యం జాగ్రత్త.

ఇట్లు
నీ పుత్రుడు
వలిపే రామ్ చేతన్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1764వ రోజు 'తాత- మనుమడు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'తాత- మనుమడు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. .

-సంపాదకులు

*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

*-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839*



### తాతకు మరణం లేదు.

మా తాత చెప్పే కథల్లో
జీవిత అనుభవాలు వినిపించేవి.
సన్నగా నవ్వే చిరునవ్వుల్లో
చరిత్రలు కళ్లముందు కదిలేవి.
తాత చెప్పిన కథల్లో
రాజులున్నారు
రాక్షసులున్నారు
కానీ నాకెందుకో...
వారందరికంటే
తాతే గొప్ప వీరుడనిపించేది.
ఆయన చేతుల
గట్టితనాన్ని తడిమినప్పుడు
అడగకుండానే మట్టివాసనల
జ్ఞాపకాలు జాలువారేవి.
నా ప్రశ్నలు ఆకాశమంతైతే
ఆయన సహనం అనంతమనిపించేది.
తను చెప్పే ప్రతి సమాధానం
ముద్దులా మృదువుగా అలరించేది.
కాలం కఠినమని తెలిసింది ఓ రోజు
తాత కుర్చీ ఖాళీగా కనిపించిన రోజు.
అక్షరాలు రాలిపోయిన కథల పుస్తకంలా
జీవితం శూన్యంగా మారిపోయింది ఆ రోజు.
ఇప్పుడు-
ఆయన చెయ్యి నా చేతిలో నుంచి జారిపోయినా
తన అడుగుజాడలు నా కాళ్లను నడిపిస్తున్నాయి
అయినా -
తాతకు మరణం లేదని తెలుసుకున్నాను
నా మనవళ్ల చేతులు పట్టుకున్నప్పుడల్లా
వారి నవ్వుల్లో మళ్లీ తాతను చూస్తున్నాను.

-నాగరాజు చుండూరి

### వంశోద్ధారకులు

గోత్రానికి గోపురం
ఇంటి నివాసానికి ముఖ్యవాసం తాత
వంశ సేద్యానికి ఆధారం
కుటుంబ గౌరవానికి పునాది
మనుమడు.
తాతా మనుమళ్ల బంధం
విడదీయలేని అనుబంధం
విడగొట్టడానికి
ఆ దేవుడికీ ఉండదు గుండెధైర్యం.
తల్లిదండ్రుల చాటు బిడ్డడు
అమ్మ నాన్నల కంటి జాడల్లో
ఎదుగుతారు
గుండె నిండా తాత పై ప్రేమ
గుట్టు దాటకుండా
దాచుకుంటారు మౌననీగా.
తాతా మనుమడి మధ్య ప్రేమ
కొసరి కొసరి వడ్డించుకునే ప్రేమ
తాత గుణగణాలు
అందిపుచ్చుకునే అధికారిమనుమడు.
దూరమైతుంటే మనుమడి ప్రేమ
తల్లడిల్లుతుంది తాత మనసు
కరిగిన వయస్సుకు
కంటి దీపంగా
మనుమడిని భావిస్తాడు తాత.
బాధ్యత ఎరిగితే మనుమడు
ఆసరాగా ఉంటాడు తాతకు
యోగక్షేమం కోరుకునీటాడు నిత్యం
తాతా మనుమలున్న ఇల్లు
దారి తప్పని రైలు
ఉమ్మడి కుటుంబానికి నిలయం.

-పొన్నాల ధనమ్మ

### మళ్ళీ మొలిచిన బాల్యం

తొలిసారి 'తాత' అని పిలిపించుకున్న వేళ
అక్షరాల్లో పట్టని అద్భుత అనుభూతి
చిన్నారి నోట పలికే
ఆ చిందరవందర మాటలు
అనంతమైన
ఆనందాన్ని కురిపించే అమృత ధారలు!.
నాడు...
ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిలో
కన్నబిడ్డల బాల్యాన్ని
మనసారా చూసుకోలేని తపన
నేడు...
మనవడి రూపంలో
మళ్ళీ దొరికిన అదృష్టం
అన్ని కోరికలనూ తీర్చుకుంటూ
పొందే అసలైన పరవశం!.
చదరంగపు ఎత్తుగడలైనా
క్యారమ్ బోర్డు ఆటలైనా
క్రీజులో క్రికెట్ బ్యాటు పట్టి
విసిరే బంతులైనా
ఓడిపోవడంలోనే గెలుపు ఉందన్నట్టు
తాత కావాలని ఓడిపోతుంటే
గెలిచిన మనవడి ముఖంలో
మెరిసే ఆనందం
తాతకు ఒక అపురూప కావ్యం!
అప్పుడే
ఎంత గొప్పగా ఎదిగాడని మురిసిపోతూ.
తనలోని మేధస్సును
మనుమడిలో చూసుకుంటూ
అసలు కంటే వడ్డీయే ముద్దన్నట్టు
కొండమీద కోతినైనా తెచ్చిచ్చే తాత ఆరాటం!.
ముడతలు పడ్డ చేతులతో
ఆ లేత వేళ్లు పట్టుకుంటే
నరాల్లో ప్రవహించేది
సరికొత్త హుందాతనం
డబ్బుతో కొనలేని
ఈ స్వచ్ఛమైన ప్రేమ
తరాల అంతరాన్ని చెరిపేసే
అజరామర బంధం!.

-విజయలక్ష్మి వడ్డేపల్లి

### వాళ్ళదో లోకం

నిద్ర లేవగానే మా మనుమడు
అడిగే ప్రశ్న "తాత లేచారా?"
ఆయన లేవడమే తడవు
తన సందేహాలన్నిటినీ తీర్చుకుంటాడు
ఆరో ఏడు నడుస్తున్న వాడి బుఱ్ఱలో
ఎన్ని ప్రశ్నలో!
ఇంటా బయటా కనబడేవాటి గురించి
పాఠాల గురించి
"ఇదెందుకిలాగే ఉంది,
ఇంకోలాగ ఎందుకుండదు?
అలా జరగకపోతే ఏమౌతుంది? "
వంటి ప్రశ్నలన్నింటికీ తాతగారు
ఓపికగా, తార్కికంగా
అర్థమయ్యేటట్టుగా చెప్పడం.
బడికి వెళ్ళడం
తిరిగి రావడం
బజారు పన్లకి వెళ్ళడం
అన్నీ తాతతోనే
పాపం ఆయన న్యూస్ పేపరూ
ఫోనూ దాచేస్తూ ఉంటాడు
తనతోటే మాట్లాడాలని!.
ఇద్దరూ కలిసి కాగితాలతో
పనికిరాని వస్తువులతో
ఏవేవో బొమ్మలు చేసుకుంటారు
వాటర్ బబుల్స్ వదులుతారు
యాక్టివిటీలు, ఎక్స్పెరిమెంట్లు
గొప్ప హడావుడిగా గడుపుతారు
సాయంత్రం నాలుగున్నర నుంచీ మొదలు
"తాతా! పద టెర్రస్ మీదకి"
ఇద్దరూ బకెట్లూ, మగ్గూ
బ్యాటూ, బంతులతో తయారు!
మొక్కలకు నీళ్ళు పోస్తూ
వాటి పూర్వాపరాలు చర్చిస్తారు
నాలుగేసి తులసాకులు నముల్తారు
నాకోసం నాలుగాకులూ
పువ్వులూ, పుదీనా ఆకులూ కోస్తారు
తృప్తి తీరా ఆడుకుని క్రిందకొస్తారు
వాళ్ళిద్దరి అనుబంధం, మైత్రీభావం చూస్తే
మా అందరికీ ముచ్చటేస్తుంది
వాళ్ళిద్దరిదీ ఓ లోకం.

-ముద్దు వెంకటలక్ష్మి

### వారసత్వం

గోత్రానికి గోపురమే
వంశానికి వారసత్వమై
ప్రేమలకు అంకురమై
పెన్నిధిగా తోడుండేది.
ఎదురుచూపుల పర్వానికి
ఆ దేవదేవుని వరం
పెద్దల పూజారుల ఆశీస్సులు
పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు
అంటూ ఇచ్చే దీవెనల ఫలం.
సంపాదన మీద తండ్రికి
ఇంటిపని మీద అమ్మకు
ఎప్పుడూ హడావిడే
తల్లిదండ్రులకు వారి పిల్లలు
పుట్టినప్పుడు కేటాయించలేని సమయాలే
ఇప్పుడు మనుమల రూపం.
ఉమ్మడి కుటుంబాల ఊసులలో
మనుమలు, మనుమరాళ్ళంతా
తాతయ్యలు నానమ్మల మీదనే
పెరిగి పెద్దయ్యేవారు.
కథలు కబుర్లతో తీర్చి దిద్దేవారు
పెద్దవాళ్లకు కాలక్షేపం
పిల్లలకు సంరక్షణ
తల్లిదండ్రులకు చేదోడు వాదోడు.
ఆధునికంలో అల్లారుముద్దయి
అసలు పిల్లలే ఆలస్యమై
అందిపుచ్చుకున్న సందర్భాలు
అపురూపమే ఆనందమే.
అయినా ఇప్పుడంతా
మాట వినని మారాములే
ఇడియట్ బాక్స్ ఇల్లు పీకి పందిరిస్తుంటే
మానవత్వపు విలువలు
మడతబడిన పేజీలే
మచ్చుకైనా కానరాని చరితలే.

-నగునూరి రాజన్న

### మరిచేవి కావు

నువ్వు నేర్పకుండా
నాకెక్కడిది ఈ హిత బోధ
నేను లేకుండా నీకెక్కడిది వూతకఱ్ఱ
నేను లేకుండా నీవు ఎప్పుడు వుండవు
మనిద్దరి సఖ్యత జగతికే ఆదర్శం.
నే పక్కలో పడుకోని దోతీ తడిపితే
ఎప్పుడు విసుక్కున్నది లేదు
నీ కఱ్ఱ లాక్కొని నిన్ను ఏడిపిస్తే
ఎప్పుడు తిట్టింది లేదు.
నాకు జ్వరమొస్తే నీవు అన్నం ముట్టింది లేదు
బడిలో దెబ్బతగిలితే అనీదరిని తిట్టనిది లేదు
నడిస్తే కాళ్ళకు రాళ్ళు గుచ్చుకుంటాయని
చంకనెత్తికొని నన్ను మోసింది బాగా గుర్తు.
నేను పాసయితే
నీ కాళ్ళకు దనీడనీ పెడితే
నన్ను నీవు మెచ్చుకున్నావు చూడు
దీవనల వర్షం కురిపినీచావు చూడు
వేయి జన్మలెత్తినా
ఆ రోజులు రావు ఏనాడు.
తాతా నువ్వు లేవు
చెప్పకుండా వెళ్ళిపోయావు
నేను దాచుకున్నాను నీజ్ఞాపకాలు
నేను తాతనయ్యేవరకు
మరిచేవి కావు.

-కందుకూరి మనోహర్

### తిరిగి వచ్చిన బాల్యం

అసలు కంటే వడ్డీముద్దంటారు
తమ కన్న పిల్లలకంటే
మనుమలే తాతకు ముద్దు
తొలిసారి తాత అనిపించుకున్న వేళ
అదో అద్భుతమైన అనుభూతి
వృద్ధాప్యంలో మనుమడే ఒక దీపకళిక
మనుమడితో
వయసు మరిచి ఆటలాడితే
బాల్యం తిరిగివచ్చినట్టుంటుంది
తాతకు తన బాల్య జ్ఞాపకాలు
కంటితెర పై తిరుగుతూ ఉంటాయి
అదో ఉద్విగ్న సన్నివేశం
అలా తమని తాము మర్చిపోయిన
సన్నివేశాలు జీవితంలో ఎన్నో
మనుమడికీ అలాగే ఉంటుంది
మనుమడు కూడా గర్వంగా అనుకుంటాడు
తాతకు తానంటే ప్రాణమని
తాతలవగానే
మనవలకి చెప్పవలసిన నీతి కథలు
సాహస కథలు పౌరాణిక గాథలు
ఎన్నో వారికి చెబుతూ
తాను కూడా వింటూ
సంతోషంగా ఆస్వాదిస్తారు
తాతా మనుమళ్ల అనురాగ బంధం
తరతరాల అనుబంధం
గతాన్ని ప్రస్తుతాన్ని కలిపే
ప్రేమలతల స్రవంతి.

-ఆర్. రమాదేవి

### ఒడవని గ్రంథం

అసలు కన్నా కొసరు ముద్దని
చెప్పింది నిజమే
అసలు కన్నా వడ్డీయే ముద్దని
అన్నదీ నిజమే
తండ్రి కొడుకుల అనుబంధం కన్నా
తాత మనుమళ్ల అనుబంధమే గొప్పదని
వింటున్నది నిజమే
నా కుమార్తె కుమారులకైనా
కుమారుడి కుమార్తెలకైనా
తాతంటేనే ఎక్కువ ఇష్టం పడతారు.
తాతకూ వారంటే ఎంతో ఇష్టం
ఇంట్లో నేను వారికెన్ని సేవలు చేసినా
ఎంత ప్రేమాభిమానాల్ని పంచినా
బయటకు తీసికెళ్ళే తాతంటేనే వారికిష్టం
ఆ విషయమై అసూయగా అనిపించినా
నా చిన్న మనుమరాలు ఆద్య
అప్పుడప్పుడూ
నామీద ప్రేమ చూపించడం
ఎడారిలో నీటి ఆదరువు
కనిపించినంత ఆనందం
మధుమేహ కారణంతో
కాలికి గాయమై
ఇబ్బంది పడే తాతగారికి
పెద్ద మనుమడు
రెండేళ్ల వయస్సులోనే బాండేజ్ అందించి
అయిపోయేదాకా పక్కనే నిలబడేవాడు
వారి మధ్య అనుబంధం
ఎప్పటికీ ఒడవని గ్రంథం
పాపం...
మనుమళ్లే లేని తాతల పరిస్థితి
ఊహించుకుంటేనే ఎంతో దుర్భరం.


-నాగిరెడ్డి అరుణ జ్యోతి

### కాలంతో కలిసి...

జీవితానికి తండ్రి ఎంత ముఖ్యమో
తాత కూడా అంతే ముఖ్యమొకప్పుడు.
ఉమ్మడి అనే మాటతో
గుమ్మడిపాదు జ్ఞాపకంవస్తుంది.
మారిన కాలమో
మనుషుల మనసులలో మార్పో
ఉమ్మడి కుటుంబం తడి లేని తరువు పాదు.
పరిహాసాలు ఈనాటి వారికి
ఏ పాటి ఆనందం ఇవ్వకపోగా
ముఖాలు ముడుచుకోవడం
ముక్తసరిగా తాతయ్యలతో మాట్లాడటం.
పిల్లల్లో వచ్చిన పెద్ద మార్పు.
"ఏమిరా బడవా!
వేలడంత వాడివి
వేపచెట్టులా తయారయ్యావు"
తాతయ్య మాటలకి
మనుమడి ముసిముసి నవ్వులు
మోముపై ముసురుకునే రోజులు
పోయాయి.
"ఏంటి తాతయ్య ఆ జోకులు?
మా ఫ్రెండ్స్ వింటే ఇంతే సంగతులు"
అంటూ ముఖం చిట్లించే రోజులివి.
అనుబంధాలు, ఆప్యాయతలు సులభం
కావు
పూల తీగకు పాది చేస, పందిరి పెట్టి
నీరు పోసి నిత్యం అపత్యంలా సాకితేనే
ఆప్యాయత, ప్రేమానురాగ పుష్పాలు
మన దోసెట్లోకి వస్తాయి.
ప్రపంచీకరణ ప్రవాహంలో
బంధాలు, అనుబంధాలు
అతుకుల బొంతలయ్యాయి
ఎంత చర్చించినా తీగె తెగిన వీణలా ఉ
ంది
నేటి తాత మనవడి సంబంధం.
అన్య దేశాలను అమ్మదేశంగా
మార్చుకొంటున్న మనుమళ్ళకి
తాతయ్య ఆప్యాయతలు తలపుకొస్తాయా?
అప్పుడైనాఎప్పుడైనా
ఇప్పుడైనా మనిషి అవకాశవాదేమో!
ఆవగింజంత అవకాశం చిక్కితే
పాతవి పక్కకు నెట్టబడుతాయి
కొత్తవి పుట్టుకొస్తాయి.
ఇది కాల ధర్మం.
మనం చూస్తున్న నిత్య సత్యం.
మార్పును జీర్ణించుకోకుంటే
ఆరోగ్యానికి హానికరం
ఆప్యాయత అతి మాటకారితనంగా తీర్పిచ్చి
"హాలో" తో పలకరింపు ముగింపు.
పాత వ్యవస్థలు ఆర్థిక,కుటుంబ అవస్థలతో
ముడివడి ఉండేవి
అందుకే ఆనాటి ప్రతిదీ ఈనాటికీ అందనిది.
ఇప్పుడున్నవాటితో తృప్తి పడడం
ఆరోగ్యానికి,ఆలోచనలకుఅవసరం.
మనుమడు కనపడితే
పలక్కుండా ఉండటం బెటర్ ఏమో
తాతయ్యకి.
కాలంతో కలిసి నడక ఉత్తమం.

-డా.సి.వసుంధర

## విశ్వకవి ఠాగూర్ బోధనలు సార్వజనీనాలు



భారతదేశానికి జాతీయ గీతం అందించిన ప్రసిద్ధ కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి రవీంద్రనాథ్ ఠాగూర్. రవీంద్రుడు రచించిన గీతాంజలి కావ్యానికి 1913లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని పొందిన తొలి ఆసియావాసిగా ఖ్యాతి చెందారు. కవి, నవలాకర్త, రచయిత, నాటకకర్తో, వ్యాసకర్త, కథా రచయిత, సంగీత కర్త, తత్వవేత్త, సంఘ సంస్కర్త, విద్యావేత్త, భాషాలేత్త, వ్యాకరణ పండితుడు, చిత్రకారుడు అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ 07 మే1861 రోజు పిరలీ బ్రాహ్మణ కుటుంబంలో దేవేంద్రనాథ ఠాగూర్ - శారదాదేవి పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో ఇంటి నాలుగు గోడల మధ్య గడిపిన రవీంద్రనాథ్ ఠాగూర్‌కు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. పాఠశాలకు వెళ్లడం ఇష్టపడక ఇంటి వద్దనే క్రమ శిక్షణతో వ్యాయామం, గణితం, చరిత్ర, భూగోళ పాఠాలు, చిత్రలేఖనం, ఆటలు, ఆంగ్లం, సంగీతం, భౌతిక శాస్త్రం, సంస్కృతి వ్యాకరణం, ఆంగ్ల సాహిత్యం చదవడం, మాతృభాషపై పట్టు సాధించడం లాంటి పలు క్రియలను ఏకకాలంలో కొనసాగించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ :**

రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లాండ్ వెళ్లి పబ్లిక్ స్కూళ్లలో చేరి ఆచార్యుల బోధనలు విని ఆంగ్ల సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. అక్కడ ఉండగానే "భగ్న హృదయం' అనే కావ్యాన్ని రచించారు. ఇంగ్లాండ్‌లో ఏడాదిన్నర పాటు ఉన్నప్పటికీ ఎలాంటి డిగ్రీ పొందకుండానే మాతృభూమికి తిరిగి వచ్చారు. 1883లో మృణాళిని దేవిని వివాహమాడిన రవీంద్రనాథ్ ఠాగూర్ బాల్యంలోనే పలు పద్యాలు, వ్యాసాలు, విమర్శలు రచించి ప్రచురించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లో బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాల సంపుటి గీతాంజలి అతి గొప్పది, నోబెల్ పురస్కారం పొందిన తొలి భారతీయ రచనగా నిలిచింది. 1901లో బాలల మనో వికాసం కోరిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ దిశగా ఐదుగురు విద్యార్థులతో "శాంతినికేతన్ విశ్వభారతి గురుకుల విశ్వవిద్యాలయాన్ని" స్థాపించారు. అదే క్రమంలో 1919లో కళా భవన్ స్థాపించా విభిన్న కళలను నేర్పించడం, తానే స్వయంగా నేర్చుకున్నారు. 'ప్రతిభ', 'ప్రకృతి - వికృతి' లాంటి పలు నాటకాలు చరించారు. అదే విధంగా 'గోరా' లాంటి ప్రఖ్యాత నవలలు రచిస్తూనే చిత్రకళ, సంగీత శాస్త్రంలో సాధన చేశారు.

**జాతీయ గీత సృష్టికర్త విశ్వకవి ఠాగూర్:**

చిన్నపాటి నుంచే జాతీయ భావాలను పునికిపుచ్చుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ దేశభక్తి గీతాలను ఆలాపించేందుకు ఇష్టపడే వారు. 1896లో జరిగిన కలకత్తా కాంగ్రేస్ సదస్సులో తొలిసారి బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' గీతాన్ని ఠాగూర్ ఆలపించారు. 1950 జనవరి 24 రోజున నాటి భారత రాజ్యాంగ సభ కమిటీ రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'జనగణమనా'ను జాతీయ గీతంగా, బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించారు. మనం ఆరాధించే దేవుడు రైతు, శ్రామికుడి రూపంలో ఉన్నాడని బోధించిన ఠాగూర్ సృజనశీల ఆలోచనలు అన్ని కాలాలకు అనువైనవిగా పేరు తెచ్చుకున్నాయి. తన సుదీర్ఘ జీవితంలో 2,000లకు పైగా పాటలు రచించారు. అణగారిన వర్గాల పక్షపాతి అయిన ఠాగూర్ శాంతి, సామరస్యాల వంటి సార్వత్రిక విలువల స్థాపనకు కృషి చేశారు.

2వ ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసాలకు చలించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యారు. వ్యాధి తీవ్రత పెరగడంతో 07 ఆగష్టు 1941న తుది శ్వాస విడిచారు. మాతృభూమి, మానవ సంబంధాల పట్ల అచంచ విశ్వాసం కలిగిన ఠాగూర్ చరిత్ర ప్రపంచ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. "గురుదేవ్", "విశ్వకవి" పేర్లతో ముద్దుగా పిలుచుకునే రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీత సృష్టికర్తగా భారతీయుల మదిలో నిలిచిపోయారు. విద్య, కళ, మానవతావాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలోచనలు, జీవితంలో అర్థాన్ని, సౌందర్యాన్ని అన్వేషిస్తూ ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ దార్శనికుడికి హృదయపూర్వకంగా నివాళుల అర్పిద్దాం, ఆయన చూపిన బాటన నిలిచే ప్రయత్నాలు చేద్దాం.

(07 మే "రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి" శుభ సందర్భంగా)



-మధుపాళీ
9949700037



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో 2024 జనవరి నుండి డా. రావి రంగారావు "వారం వారం సాహిత్యం వర్కు ఫాపులు" నిరంతరాయంగా నిర్వహిస్తున్న క్రమంలో ఈ వారం కథల వర్క్ షాప్ లో విజేత సంబరాజు రమణి కథ "సంకెళ్లు" చదవండి.

-సంపాదకులు

## "సంకెళ్లు"




"రంగమ్మా, ఏమిటి, నిన్న పనెగ్గొట్టావ్? ఉదయం కుదరలేదే అనుకో... సాయంత్రం అయినా వచ్చావు కాదు" అంది కుసుమ నిష్టూరంగా...

"నేను పనికి బయలుదేరా నమ్మా, ఇంతలో మా పక్కింటి లచ్చిమి వచ్చి ఇయ్యాల ఓటుకి నోట్లు పంచడానికి వస్తారంటే... రంగీ పనికి పోమాకు ఇంట్లోనే ఉండు. నీ ఒక్కదాని కోసం వాళ్లు మళ్లీ రారు అంది. ఏదో ఒక రూపాయి వస్తాదంటే ఆశే కదమ్మా! అందుకే రాలా" అంది రంగమ్మ.

"ఎంతిచ్చారు ఏంటి" అంది కుసుమ.

"ఓటుకి పది వేలు ఇచ్చారమ్మా, మా ఇంట్లో నాలుగు ఓట్లు మొత్తం 40 వేలు ఇచ్చారు" అంది రంగమ్మ.

"నాలుగు ఓట్లు ఏంటే... మీరు ఇద్దరేగా! పిల్లలు చిన్నవాళ్లు" అంది కుసుమ.

"అదంతేలే అమ్మగారూ, సచ్చిన మా అత్త మావలు ఎలచ్చన్ల సమయాన బతికొచ్చి ఓటేసి మళ్ళీ సస్తారు అమ్మగారు... ఆ డబ్బులు మా ఆయన చేతిలో పడితే పేకాటకి తగలేస్తాడని పట్టీలు కొన్నానమ్మా" అంది. దగదగ మెరిసే మువ్వల పట్టీలు చూపిస్తూ.

....

కుసుమ భర్త కిరణ్ తాలూకా ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న కిరణ్ నుండి లంచ్ బాక్స్ తీసుకుంటూ "ఏవండీ, ఈరోజు మన వీధిలో చెవిలో పువ్వు పార్టీ వాళ్లు, రేపు పంగనామాల పార్టీ వాళ్లు ఓటుకి నోట్లు పంచుతారంట, అందరూ తీసుకుంటున్నారు, మనమూ తీసుకుందామండి" అంది కుసుమ.

"నిన్న రంగమ్మ వాళ్ళ కాలనీలో పంచారుట. వాటితో రంగమ్మ ఎంచక్కా పట్టీలు కూడా కొనుక్కుంది" అంది కుసుమ.

"రంగమ్మకు చదువు సంధ్య లేదు. నువ్వు చదువుకున్న దానివేగా, నీ వివేకం ఏమైంది?" అన్నాడు కిరణ్.

"మీరు అలాగే అంటారు, మన ఎదురింట్లో ఉండే భార్యాభర్తలు ఇద్దరూ గవర్నమెంట్ ఉద్యోగస్తులు అయినా ఇంటి స్థలం, ఇల్లు కూడా రాయించుకున్నారు.

మీరేమో సత్యహరిశ్చంద్రుడిలా కూర్చుంటారు కాబట్టే మనం ఎదుగు బొదుగు లేకుండా ఇలాగే ఉన్నాం" అంది కుసుమ.

"అహా అలానా ! ఐతే లంచాలు తీసుకుని నేను జైలు పాలైతే. నువ్వు పిల్లలు వాళ్ళిచ్చే ఉచితాలతో బతకండి ఎంచక్క.." అన్నాడు కిరణ్.

"ఓటుకి నోటు తీసుకునేటపుడు పండుగలా బానే ఉంటుంది... ఎలక్షన్లు అయ్యాక నిత్యావసరాల ధరలు చుక్కల నంటుతుంటే ఆడపిల్లల మాన ప్రాణాలకు రక్షణ కరవై, మత విద్వేషాల చిచ్చులో మానవత్వం గతి తప్పుతుంటే, ఉచితాలనే సంకెళ్లలో చిక్కుకున్న మనం ఎదురొడ్డి పోరాడుగలమా" అన్నాడు కిరణ్.

.......

తలుపులు డబడబా కొడుతున్నారు అర్ధ రాత్రి ఎవరో... తలుపులు తీస్తే ఎదురుగా పోలీసులు. లంచం తీసుకున్న కేసులో అరెస్ట్ చేయటానికి వచ్చారు. ఒక్కసారే భయంగా "అరెస్టు చేయొద్దు" అంటూ గట్టిగ కేకలు వేస్తోంది కుసుమ.

.......

"ఏంటి కుసుమ, ఎందుకు ఆలా అరుస్తున్నావ్..." అంటూ కిరణ్ పిలుపుకు కలలో నుండి బయటకు వచ్చింది కుసుమ.

...

పొద్దున్నే బడికి వెళ్ళబోతూ వీళ్ల గారాలపట్టి ఆరేళ్ల మృదుల "అమ్మ! ఓటుకి నోటు మాయలో పడక ఓటు విలువ నెరిగి వివేకంతో అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకుంటే మా భవిష్యత్తుకు బంగారు బాట ఏర్పడుతుందని, అది సమాజానికి మేలని టీచరు గారు చెప్పారు. మీరు ఎవరికి ఓటేస్తారు అమ్మా!" అని అడిగింది. కూతురును గుండెలకు హత్తుకుంటూ "నీ బంగరు భవితకై సమర్థుడైన అభ్యర్థికే మా ఓటు" అంటున్న కుసుమను చిరునవ్వుతో చూసాడు కిరణ్

-సంబరాజు రమణి

## సామాన్యులను అలరించగలిగే సాహిత్యంతో పౌర సమాజం జాగృతం

– కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో కొత్త అనీల్‌కుమార్, బుర్రా మధుసూదన్‌రెడ్డి, దాస్యం సేనాధిపతి, ఆవిష్కర్త డా॥నందిని సిధారెడ్డి, డా॥మచ్చ హరిదాస్, అన్నాడి గజేందర్ రెడ్డి, బొమ్మకంటి కిషన్, అనిత.

హైదరాబాద్, మే 6:పండితుల పామరుల హృదయాలను కదిలించగలిగే సాహిత్యంతో పౌర సమాజం జాగృతం అవుతుందని ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. **మే 3 ఆదివారం** కరీంనగర్ ఫిలిమ్ సొసైటీ సమావేశ మందిరంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం - శాతవాహన లయన్స్ క్లబ్ - లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన కవన గోదారి కవితా సంపుటి ఆవిష్కరణ సమావేశంలోముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలనం చేసిన డాక్టర్ నందిని సిధా రెడ్డి గ్రంధాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ తరుగుతున్న మానవీయ విలువలను తన కవిత్వంతో తట్టి లేపడానికి బుర్ర మధుసూదన్ రెడ్డి కృషి చేయడం అభినందనీయమ న్నారు. యుద్ధాలు నుంచి దేశంలో జరుగుతున్న అంతర్గత సంక్షోభాల వరకు పలు అంశాలను ఇతివృత్తంగా చేసుకొని చక్కటి కవిత్వం రాసి మధుసూదన్ రెడ్డి తన ప్రత్యేకతను చాటుకున్నారని అన్నారు. కవిత్వానికి వర్ణ వర్గాలు ఉండవని, కవితలు సమాజ హితం కోరుతాయని, కవుల స్వభావం సున్నితంగా, దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని తమ కలానికి పదును పెడతారని అన్నారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి కవి, రచయిత, కాలమిస్టు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, సమాజ సేవకులుగా పలు రంగాల్లో తమదైన విలక్షణ ప్రతిభను చాటుకుంటూ దూసుకుపోతున్నారని తెలిపారు. తన కవిత్వంతో పలు రకాలుగా సామాన్యులను సహితం చైతన్య పరుస్తూ తమదైన శైలిని చాటుకున్నారని కొనియాడారు. గ్రంధ సమీక్ష చేసిన సాహితీవేత్త అన్నాడి గజేందర్ రెడ్డి మాట్లాడుతూ కవన గోదారి కవితా సంపుటిలో 123 కవితలు పొందుపరి చారని అన్నారు. మందుబాబులు, సైబరాసురులు, మాదకాసురులు, అవినీతి రాజకీయా లు, పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ప్రబుద్ధులను వదలకుండా తమదైన ఘాటు కవితలతో చురకలు అంటించారని తెలిపారు. ఆత్మీయ అతిథులు డాక్టర్ మచ్చ హరిదాసు, కొత్త అనిల్ కుమార్‌లు మధుసూదన్ రెడ్డి కవిత్వంలోని చమక్కులను వివరించారు. తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి కిషన్, సహ కార్యదర్శి అనితలు పాల్గొని పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, యువతీయువకులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధా రెడ్డిని ఘనంగా సత్కరించారు. అదే విధం కవితా సంపుటి తొలి ప్రతిని బుర్ర జానకి రెడ్డి స్వీకరించారు. వివిధ సాహిత్య, సాహిత్యేతర సంస్థల బాధ్యతలు సిధా రెడ్డిని సత్కరించారు.

## ఈనెల 17న బండ్ల తారకేష్ రచించిన "నానీ మధుతారకలు" నానీల కవితా సంపుటి ఆవిష్కరణ

బండ్ల తారకేష్ రచించిన "నానీ మధుతారకలు" నానీల కవితా సంపుటి ఆవిష్కరణ సభ 17 మే 2026 ఆదివారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు), హైదరాబాద్‌లో జరుగుతుంది.

డా. ఎస్. రఘు అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా. ఎన్. గోపి "నానీ మధుతారకలు" పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

ఆత్మీయ అతిథులుగా సజ్జా వెంకటేశ్వర్లు, కుడికాల వంశీధర్ & డా. గిన్నారపు ఆది నారాయణ పాల్గొంటారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది.

అందరూ ఆహ్వానితులే.

-మద్దాళి రఘురాం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com